నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 27-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:49 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

మర్యాదల నొసగగ, సౌ
కర్యములను బెంచగ తెలగాణములోనన్
పర్యాటక రంగములో
చర్యలు చేపట్ట బూనె సర్కారు మొగిన్ !!

పర్యాటక రంగంలో ఆతిథ్యపు మర్యాదలు సౌకర్యాలు పెంచడానికి తెలంగాణా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనివలన రాష్ట్రానికి ఆదాయం, పర్యాటకులకు సౌకర్యాలు, ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

అమెరికాలో చైనా దేశ
అధ్యక్షుడి సందర్శణ
వికసిస్తేనే విశ్వశాంతి
విహంగాల ఆకర్షణ
కడుపులోన కత్తులతో
కరచాలన సుమగంధం
కమ్యూనిజం క్యాప్టలిజం
కలిసి నడిచే సంబంధం



-వేల్పుల నారాయణ
9440433475

# ఉత్తర్ ప్రదేశ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో 2026 వేదికగా యూపీ పారిశ్రామికాభివృద్ధికి కీలక అడుగు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26:ఉత్తర్ ప్రదేశ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో 2026 వేదికగా యూపీ పారిశ్రామికాభివృద్ధికి కీలక అడుగు పడింది. యమునా ఎక్స్‌ప్రెస్‌వే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో వివిధ రంగాలకు చెందిన ఐదు ప్రముఖ సంస్థలకు రూ. 469 కోట్ల అంచనా వ్యయంతో పారిశ్రామిక ప్రాజెక్టుల ఏర్పాటుకు స్థల కేటాయింపు పత్రాలను కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా అందించారు.

ఈ కేటాయింపుల ద్వారా YEIDA ప్రాంతంలో మొత్తం 71,190 చదరపు మీటర్ల భూమిని కేటాయించారు. ఈ ఐదు ప్రాజెక్టులు అందుబాటులోకి రావడం ద్వారా దాదాపు 4,625 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. కేవలం పెట్టుబడి ప్రతిపాదనల స్థాయిలోనే కాకుండా, వాటిని నేరుగా క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి ఈ కార్యక్రమం బాటలు వేసింది.

కేటాయింపు పత్రాల అందజేత అనంతరం పారిశ్రామికవేత్తలతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ముఖాముఖి మాట్లాడారు. ఉత్తర్ ప్రదేశ్‌లో పారిశ్రామిక రంగాన్ని వేగవంతం చేయడం, స్థానిక తయారీ శక్తిని పెంచడం, సరఫరా గొలుసును బలోపేతం చేయడంపై ఆయన చర్చించారు. ప్రతిపాదించిన ప్రాజెక్టులు త్వరగా ఉత్పత్తి దశకు చేరుకునేలా పనులు వేగవంతం చేయాలని ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలను అమిత్ షా కోరారు.

భూమి పొందిన సంస్థల్లో సీ అండ్ ఆర్ టెక్స్‌టైల్స్, పర్ఫెక్ట్‌ప్యాక్ లిమిటెడ్, SABS ఎక్స్‌పోర్ట్స్ ఇంటర్నేషనల్, సింప్లాస్ట్ ఇండియా, సాహు ఎక్స్‌పోర్ట్స్ ఉన్నాయి.

# ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనాలు పూర్తి.. పోలీసులకు సీపీ సజ్జనార్ అభినందనలు



హైదరాబలాద్, సెప్టెంబర్ 26: భాగ్య నగరంలోని నాలుగు కమిషనరేట్‌లలో విజయవంతంగా గణేశ్ శోభాయాత్రలు ముగిశాయని హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ వ్యాఖ్యానించారు. ఈ వేడుకకు సహకరించిన అన్నిశాఖల అధికారులను అభినందించారు. హోం గార్డ్ నుంచి ఐపీ ఎస్ అధికారుల వరకు అందరికీ ధన్య వాదాలు తెలిపారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్‌లో మీడియాతో సీపీ సజ్జనార్ మాట్లాడారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎక్కువగా శోభాయాత్రలు జరిగాయని వెల్లడించారు.

**ఖైరతాబాద్, బాలాపూర్ గణపతుల విగ్రహాలను సమయానికి నిమజ్జనం చేశాం..**

భాగ్యనగరంలోని గణేశ్ నిమజ్జ నోత్సవాల బందోబస్తు కోసం తెలంగాణ లోని బయట జిల్లాల నుంచి సిబ్బందిని రప్పించామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిమజ్జనాలను విజయవం తంగా పూర్తి చేశామని తెలిపారు. ఖైరతాబాద్, బాలాపూర్ వినాయకుల విగ్రహాలను సమయానికి నిమజ్జనం చేశామని వెల్లడించారు. భాగ్యనగర్ ఉ త్సవ సమితి వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈసారి గణనాథుల విగ్రహా లను దర్శించుకోవడానికి భక్తులు ఎక్కువగా వచ్చారని అన్నారు. 30 లక్షలకు పైగా భక్తులు ఖైరతాబాద్ గణేశ్‌ను దర్శించుకున్నారని చెప్పారు. బాలాపూర్ లంబోదరుడిని 15 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని వెల్లడించారు.

**48 గంటల పాటు పోలీసులు నిద్ర లేకుండా పనిచేశారు..**

వినాయకుల శోభాయాత్రాల్లో కొన్ని కొన్ని లోపాలను గుర్తించామని.. వచ్చే రోజుల్లో వీటిని సరిదిద్దుకుంటామని సీపీ సజ్జనార్ చెప్పారు. రాబోయే రోజుల్లో మెరుగైన సేవ లను అందిస్తామని స్పష్టం చేశారు. పోలీసు అధికారులు నిద్ర లేకుండా బందోబస్తు చేశారని తెలిపారు. శోభా యాత్రలో కలర్ పేపర్‌తో చాలా ఇబ్బంది అవుతోందని.. వచ్చేసారి వీటిని బ్యాన్ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్నదానం చేసే ప్రాంతాల్లో చెత్తను ఇష్టానుసారంగా వేస్తు న్నారని.. అది చాలా ఇబ్బందిగా మారిందని తెలిపారు. శోభాయాత్రలో అల్లరి చేసిన మం దుబాబులపై చర్యలు ఉంటాయని హెచ్చరిం చారు. పోలీస్ అధికారులు ఈ వేడుక కోసం 48 గంటల పాటు నిద్ర లేకుండా పనిచేశారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# కేంద్ర కులగణనలో బీసీల లెక్క చెప్పాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



సిద్దిపేట జిల్లా, సెప్టెంబర్ 26 బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ (ఖనీనినిజీఎ ఖతీజీఎష్త్రజీనిజీతీ) వ్యాఖ్యానించారు. ఈరోజు (శనివారం) సిద్దిపేట జిల్లాలోని వేములవాడ రోడ్డులో నిర్వహించిన చాకలి ఐలమ్మ 131వ జయంతిలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కలెక్టర్ హైమావతి , సీపీ రశ్మీ పెరుమాళ్ పాల్గొన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి మంత్రులు నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల లెక్కలను కేంద్ర ప్రభుత్వం తీస్తోందని.. బీసీల లెక్కలను ఎందుకు చెప్పట్లేదని ప్రశ్నించారు. కేంద్రం చేస్తున్న కులగణనలో బీసీల లెక్క తేలాలని డిమాండ్ చేశారు. కోర్టు కేసుల నేపథ్యంలో రిజర్వేషన్లలో జాప్యం జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

చాకలి ఐలమ్మ గొప్ప వ్యక్తి అని మంత్రి వాకిటి శ్రీహరి కొనియాడారు. ఇసునూర్ దొరపై ఆమె పోరాటం చేశారని తెలిపారు. ఇంకా అక్కడక్కడా దొరల పాలన కనబడుతోందని మంత్రి పేర్కొన్నారు.

# సమిష్టి కృషితో జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా సాగిన వినాయక విగ్రహాల నిమజ్జనం

## క్షేత్ర స్థాయిలో కష్టపడి విధులు నిర్వర్తించిన అదికారులు, సిబ్బందిని అభినందించిన ఎస్పీ



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 26:(నేటినిజం ప్రతినిధి):. ఈనెల 14వ తేదీన ప్రారంభమైన గణేష్ నవరాత్రి ఉ త్సవాలు జిల్లాలో వ్యాప్తంగా సమిష్టి కృషితో అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా,ప్రజానీకానికి ఇబ్బందులు కలగకుండా నిమజ్జనాన్ని ప్రక్రియ పూర్తి చేయడం జరిగింది అని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు.జిల్లాలో 2200 పైగా గణేష్ మండపాల నుండి విగ్రహాలు శాంతియుత వాతావరణంలో నిమజ్జనం చేయబడ్డాయిని నిమజ్జన ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, ఆరోగ్యశాఖలు సిబ్బంది సహకారంతో సమన్వయంగా పనిచేయడం వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదని ఎస్పీ అన్నారు. జిల్లా వ్యాప్తంగా గడిచిన 11 రోజులపాటు 24 గంటలు క్షేత్రస్థాయిలో పనిచేసే పోలీస్ అధికారులు,సిబ్బంది యొక్క కృషి వల్లనే గణేష్ ఉత్సవాలను విజయవంతంగా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించుకున్నామని దీనికి కృషి చేసిన పోలీస్ అధికారులను,సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.నిమజ్జనం విజయవంతంగా, ప్రశాంతంగా పూర్తయ్యేందుకు సహకరించిన జిల్లా ప్రజలకు, మండపాల నిర్వాహకులకు ఎస్పీ ఈసందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ రాబోవు రోజుల్లో జరిగే పండుగలను ఇదే స్ఫూర్తితో జరుపుకోవాలని కోరారు.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తెలంగాణ రక్షణ సేన పోటీ చేస్తుంది: కల్వకుంట్ల కవిత ప్రకటన

హైదరాబలాద్, సెప్టెంబర్ 26: ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నికలో తెలంగాణ రక్షణ సేన పోటీ చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఉప ఎన్నికలో తమ అభ్యర్థిని నిలబెడతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ పార్టీ మార్పు అంశంపైనా ఆమె స్పందించారు. ఓ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేయడాన్ని తప్పుబట్టారు. ఇలాంటి చర్యలు సమర్థనీయం కాదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణపైనా కవిత స్పందించారు. క్లరికల్ తప్పిదాల కారణంగా అధికారులు ఓట్లు తొలగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని అన్నారు. బీజేపీ ప్రోత్సాహంతో కుట్రపూరితంగా ఓట్ల తొలగింపు జరుగుతోందనే చర్చ ప్రజల్లో ఉ ందని కవిత పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. ఆదిలాబాద్ రిమ్స్‌లో చిన్నారుల మరణాలు అత్యంత బాధాకరమని అన్నారు. తెలంగాణలో విద్య, వైద్య రంగాలను ప్రభుత్వం సరిదిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. చిన్నారుల మరణాలపై ప్రభుత్వం సమగ్రంగా దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్య సేవలు సరిగా అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. నిమ్స్, నీలోఫర్ వంటి ఆస్పత్రుల్లో మంత్రులు ఫోన్ చేసినా బెడ్లు దొరకని పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. పదకొండు రకాల ఆరోగ్య పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన బడ్జెట్ కేటాయించలేదని కవిత ఆరోపించారు. ఆరోగ్యశ్రీ బకాయిలనూ ఇప్పటికీ విడుదల చేయలేదని మండిపడ్డారు.

ప్రభుత్వ ఆస్పత్రులను మంత్రులు పట్టించుకోవడం లేదని కవిత విమర్శించారు.

ప్రభుత్వ హాస్టళ్లు, ఆస్పత్రులను ఆయా జిల్లాల కలెక్టర్లు క్రమం తప్పకుండా సందర్శించాలని సూచించారు. ప్రతి జిల్లాలో తెలంగాణ రక్షణ సేన తరఫున ప్రభుత్వ వైద్యశాలలను సందర్శించి పరిస్థితులను పరిశీలిస్తామని తెలిపారు. ఇంతమంది చిన్నారులు మరణిస్తుంటే తెలంగాణను డల్లాస్, సింగపూర్ తరహాలో అభివృద్ధి చేస్తామని ఎలా చెబుతారని సీఎం, మంత్రులను ప్రశ్నించారు.

మరోవైపు, ఐటీడీఏకు కేంద్రం నుంచి వచ్చిన నిధుల్లో 70 శాతం వినియోగించలేదని కవిత ఆరోపించారు. కోఠి ఆస్పత్రిలో మిడ్‌డే మీల్స్ ఏర్పాటు చేస్తామన్న ప్రతిపాదనను గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనుమతించలేదని పేర్కొన్నారు.

తన ఫామ్‌హౌస్‌పై వస్తున్న ఆరోపణలను కవిత ఖండించారు. అక్కడ ఎలాంటి అక్రమ భూములు లేవని, ఇనాం, కబ్జా లేదా అసైన్డ్ భూమి లేదని చెప్పారు. తన ఫామ్‌హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదని, తన ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై, ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం ద్వారా అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలు గతంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఫామ్‌హౌస్‌కు వెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని కవిత పేర్కొన్నారు.

# అనంతసాగర్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది.

## -ఆలయ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు. -ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి.



సంగారెడ్డి, సెప్టెంబర్ 26(నేటి నిజం ప్రతినిధి)నారాయణఖేడ్ మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

**శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన**

అనంతసాగర్ గ్రామంలో శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సీజీఎఫ్ ఎయిడ్ నిధుల ద్వారా రూ.40 లక్షలు, మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ ద్వారా రూ.10 లక్షలు.. మొత్తం రూ.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టనున్న ఆలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి శంకుస్థాపన చేశారు.

ఆలయ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన సహకారం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభాకాంక్షలు**

అనంతరం గ్రామంలోని పలువురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని, నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న కుటుంబాలకు శు భాకాంక్షలు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

**స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

అనంతసాగర్‌తో పాటు రుద్రారం, బంద్రాంపల్లి, లింగాపూర్, చందాపూర్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ అనంతసాగర్ గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. గతంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ప్రస్తుతం కూడా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళు న్నామని తెలిపారు.ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఇందిరమ్మ ఇళ్లు, స్మార్ట్ రేషన్ కార్డులు, పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రజలకు ప్రయోజనం కల్పిస్తోందని ఎమ్మెల్యే వివరించారు. అనంతసాగర్ గ్రామంలో ఇంకా అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసి ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు, ఆత్మ చైర్మన్ వినోద్ పాటిల్, మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ సేట్, రమేష్ చౌహాన్, మాజీ ఎంపీటీసీ పండరి రెడ్డి, మండల తహసీల్దార్, ఎంపీడీవో, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు 'రోటరీ' అవార్డులు

ఖమ్మం, సెప్టెంబర్ 26: రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్నర్ద సారపాక ఆధ్వర్యంలో నేషన్ బిల్డర్స్ అవార్డ్స్ పేరుతో కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్నర్ద అధ్యక్షుడు ఆర్పీ సింగ్ క్లబ్ బాధ్యులతో కలిసి మండలంలో ఐదుగురు ఉత్తమ ఉపాధ్యాయులకు రోటరీ అవార్డులు అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ బాధ్యులు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి, విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో చూపుతున్న శ్రద్ధ, క్రమశిక్షణ, నైపుణ్యం, జ్ఞానం అందించడంలో ఎంతో కీలకపాత్ర వహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వప్రెసిడెంట్ ఆర్పీ సింగ్, జేకే దాస్, కార్యదర్శి డేవిడ్ అలీవర్, గుత్తేదారులు పాకాల దుర్గాప్రసాద్, బసప్ప రమేష్, మహేశ్రెడ్డి, యాకూబ్, ఏసోబు, సుధాకర్రెడ్డి, సాయిరాం, సూర్యప్రకాష్, ఫణి, తిరుపతిరావు, రోటరాక్టర్స్ మయాంక్, సంగీత్ పాల్గొన్నారు.

# నదులతోనే జీవులు, జలం, అడవులు

## (27 సెప్టెంబర్ "ప్రపంచ నదుల దినోత్సవం" సందర్భంగా)

భూగ్రహ జీవనాడులుగా జీవనదులు భూమాత ఉపరితలంపై నిరంతరం ఏరులై పారుతూనే ఉన్నాయి. పర్యావరణంలో అతి ప్రధానమైన వనరులుగా జీవ నదులు ప్రాణికోటికి విశిష్ట సేవలను అందిస్తున్నాయి.

నదులు ప్రవహించే జలాలు మాత్రమే కాదు, భూమండల గుండె సవ్వడులు. ఈ పుణ్య నదులు ధరణికే ప్రాణమిచ్చే వరాలు. పృథ్వీపై నెలకొన్న సహజ నదులు దేవుడిచ్చిన అపూర్వ వరప్రసాదాలు. జీవనదులు బిలియన్ల మానవాళికే కాదు సకల జీవకోటికి అవసరాలకు తాగు నీటిని, ఆహారాన్ని, జీవనోపాధులను కల్పిస్తున్నాయి.

నదీ తీరాలు మానవ వికాస కేంద్రాలు, ఆవాస క్షేత్రాలు. ప్రపంచవ్యాప్త జీవవైవిధ్య పునరుద్ధరణతో పాటు సంరక్షణ భాద్యతలను తీసుకుంటున్నాయి.

సువిశాల భారత దేశ పుణ్య భూమిపై ప్రవహిస్తున్న గంగా, గోదారి, యమున, నర్మద, సింధు, మహానది, కావేరి లాంటి జీవనదులు దేవతలుగా పూజించబడుతున్నాయి.

### నదీజలాల ప్రాధాన్యం:

నదీజలాలు పరమ పవిత్రం, దైవంతో సమానం. నదీజలాలు ఒక సాధారణ సహజ వనరులు మాత్రమే కాదని, అవి ప్రకృతి బహుకరించిన ప్రాణాలు నిలిపే పవిత్ర సంపద అని నమ్మాలి. ఏ దేశంలోనైనా నదులు జీవకోటికి తాగు నీటిని ఇవ్వడమే కాకుండా వ్యవసాయం, పరిశ్రమలు, ఉపరితల రవాణా రంగాలకు ఊపిరిగా నిలుస్తున్నాయి.

నీటి ప్రాధాన్యాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఇటీవల 'జల శక్తి మంత్రిత్వ శాఖ'ను కూడా ఏర్పాటు చేసి పలు నదుల పరిరక్షణ చర్యలను తీసుకుంటున్నాయి.

గత ఐదు దశాబ్దాలుగా మంచి నీటి వనరుల్లో జీవించే జీవరాశుల్లో దాదాపు 83 శాతం వరకు కనుమరుగా అయ్యాయని తెలుస్తున్నది.

నేటి డిజిటల్ యుగంలో మారుతున్న జీవనశైలి, జీవన విలువల నడుమ నదుల పరిరక్షణ యజ్ఞానికి అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి.

నదీ జలాల కాలుష్యం, పారిశ్రామిక వ్యర్థాల తల నొప్పి, నదీజలాల దుర్వినియోగం, అర్థరహిత డ్యామ్‌ల నిర్మాణం, జలాల అక్రమ తరలింపు, వాతావరణ ప్రతికూల మార్పులు, స్వార్థానికి నదీమతల్లిని వెన్నుపోటు పొడవడం, అక్రమ మైనింగ్, అడవుల నరికివేత, ఆహార అభద్రత, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం, ప్రణాళిక రహిత పట్టణీకరణ, నదీజలాల పరిరక్షణ చట్టాల ఉల్లంఘనలు లాంటి కార్యకలాపాలతో నదీజలాలు పలుచబడడం లేదా గరళ కేంద్రాలుగా మారడం కొనసాగుతున్నది.

### ఆరోగ్యకరమైన నదులు, ఆరోగ్యవంతమైన భవిష్యత్తు:

నదీ జలాల పరిరక్షణ, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయడానికి ప్రజా చైతన్య కార్యక్రమాల నిర్వహణకు 1980 నుంచి ప్రతి ఏట సెప్టెంబర్ నాలుగవ ఆదివారం, అనగా 27 సెప్టెంబర్ 2026 రోజున ప్రపంచవ్యాప్తంగా "ప్రపంచ నదుల దినం" లేదా "వరల్డ్ రివర్స్ డే" వేడుకలను నిర్వహించడం జరుగుతున్నది.

2026 ప్రపంచ నదుల దినం ఇతివృత్తంగా "నదులు లేనిదే అడవులు, నీరు, జీవరాశులు లేవు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించుట జరుగుతోంది.

నీటి కాలుష్య కట్టడి, నీటిని వ్యాపారంగా మార్చే ప్రైవేట్ రంగాల రెక్కలు విరవడం, నదీ జలాల దుర్వినియోగాలను అరికట్టడం, వ్యర్థాలను నదుల్లో కలుగకుండా అడ్డుకట్ట వేయడం, శుద్ధ జలాల సంరక్షణ, నదీ తీరాల దురాక్రమణలను వ్యతిరేకించడం, వాటర్ షెడ్ నిర్మాణాలు చేపట్టడం, నదుల జీవవైవిధ్యాలను కాపాడడం లాంటి చర్యలు తీసుకోవడం ద్వారా నదుల పునరుద్ధరణ జరిగి పూర్వపు శుద్ధ జలాలు తిరిగి జరజరా వాగులై, ఏరులై, నదులై నవ్వుతూ ప్రవహిస్తాయి.

భూమిని ఒక పవిత్ర సహజ పుట్టినిల్లుగా చూసుకోవడం మనందరి కనీస కర్తవ్యం. నదుల పరిరక్షణతో సుస్థిరాభివృద్ధి ముడిపడి ఉంటుంది.

ప్రపంచ మానవాళి ఐక్యతతో మానవ హారం పడితేనే శుద్ధ నదీజలాల పునర్వైభవం సుసాధ్యం అవుతుంది. నదుల పరిరక్షణ అంటే మానవాళి మనుగడను కాపాడుకోవడమే అని భావించాలి.

కాలుష్య నదీజలాలు మానవ జాతికే కాకుండా జీవకోటి ఉనికికే పెను ప్రమాదాలని గుర్తుంచుకోవాలి.

ప్రపంచ నదుల దినం వేదికగా నదీ జలాల శుద్ధి, అక్రమ డ్యామ్‌ల నిర్మాణాలను వ్యతిరేకించడం, విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు, నదుల అంశంలో పోటీల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు లాంటివి పెద్ద ఎత్తున నిర్వహించి రాబోయే తరానికి సరైన తాగు నీటి వనరులను అమూల్య బహుమతులుగా అందిద్దాం, పవిత్ర నది మాతలకు నిత్యం ప్రణమిల్లుదాం.



-మధుపాళీ
9949700037

# దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీ జయంతి.. నివాళులు అర్పించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26:పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గారి జయంతి ఈ రోజు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆయనకు నివాళులు అర్పించారు. పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గారి 'అంత్యోదయ' దృష్టికోణంతో పాటు, సాటి సమాజం ఆదరించకుండా దూరంగా అట్టిపెట్టేసిన వర్గాల వారి అభ్యున్నతికి పాటుపడాలన్న ఆయన ఆదర్శాలు దేశ నిర్మాణానికి మూలాధారమని ప్రధానమంత్రి అన్నారు. పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గారి ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అనుసరిస్తూ సామాజిక, జాతీయ బాధ్యతలను నెరవేర్చాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, ఒక సంస్కృత సుభాషితాన్ని ప్రజలతో శ్రీ మోదీ పంచుకున్నారు. ఈ సుభాషితం.. అదృష్టం కన్న నిరంతర కృషితో, సాహసంతో విజయాన్నీ, నూతన ఆవిష్కరణలనీ సాధించవచ్చని మనకు బోధిస్తోంది."దేశ సేవకు అంకితమైన అసలైన సాధకుడు పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గారు. ఆయన జయంతి సందర్భంగా ఆయనకు ఇవే గౌరవపూర్వక నమస్సులు. సమాజంలో ఆదరణకు నోచుకోకుండా మిగిలిపోయిన ఆఖరి వ్యక్తిని కూడా ఉన్నత స్థానానికి తీసుకురావడం దేశ నిర్మాణానికి కీలకమని ఆయన భావించారు. అంత్యోదయ వంటి ఒక ఆలోచనా స్రవంతిని మనకు అందించారు. ఈ భావజాలంతో, నేటికీ ప్రజాసంక్షేమానికి అద్భుత స్ఫూర్తి లభిస్తున్నది. ఆయన ఆలోచనలను, ఆదర్శాలను మనలో ఇముడ్చుకొని సామాజిక, జాతీయ కర్తవ్యాలను నెరవేర్చాలన్న సంకల్పానికి ఈ విశిష్ట సందర్భంలో పునరంకితం అవుదాం.. ముందుకు రండి.ఏ వ్యక్తిలో అయినా ప్రయత్నం, పట్టుదల ఎంత అధికంగా ఉంటే, అంత త్వరగా విజయాన్ని సాధించవచ్చు. నూతన ఆవిష్కరణలు కూడా నిరంతర ప్రయత్నం వల్ల సాధ్యపడతాయి. కాబట్టి భాగ్యం కన్న తదేక దీక్షతో పనిచేసినప్పుడూ, సాహసంతో ముందుకు పోయినప్పుడూ, కొత్త కొత్త ఆలోచనలను సాకారం చేయాలని గట్టిగా అనుకున్నప్పుడూ విజయం సిద్ధించడమే కాకుండా నూతన ఆవిష్కరణకు కూడా మార్గం సుగమం అవుతుందని పైన ప్రస్తావించిన సంస్కృత సుభాషితం మనకు సూచిస్తోంది" అని పేర్కొన్నారు.

# స్పెషల్ క్యాంపెయిన్ 6.0 ద్వారా 3,100కు పైగా ప్రజా సమస్యలు పరిష్కరించిన ఆయుష్ మంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నవంబర్ 2025 నుంచి ఆగస్టు 2026 వరకు నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్ 6.0 కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమం ద్వారా పౌర కేంద్రితమైన సమర్థ పాలన, సకాలంలో ఫిర్యాదుల పరిష్కారం పట్ల తన నిబద్ధతను మంత్రిత్వశాఖ పునరుద్ఘాటించింది. పెండింగ్‌లో ఉన్న సిఫార్సుల పరిష్కారాన్ని వేగవంతం చేయడంపైనా... మంత్రిత్వ శాఖ, దాని సంస్థల వ్యాప్తంగా సంస్థాగత సామర్థ్యాన్ని బలోపేతం చేయడంపైనా ఈ ప్రచారం ప్రధానంగా దృష్టి సారించింది.

ప్రచార కాలంలో 3,134 ప్రజా ఫిర్యాదుల్లో 3,100 ఫిర్యాదులను పరిష్కరించిన మంత్రిత్వ శాఖ... దాదాపు 99 శాతం పరిష్కార రేటును సాధించింది. 461 ప్రజా ఫిర్యాదుల అప్పీళ్లలో 454 అప్పీళ్లను పరిష్కరించి, పౌరుల సమస్యలను సకాలంలో, చురుగ్గా పరిష్కరించడం పట్ల తన నిబద్ధతను చాటింది.

ప్రభుత్వ సిఫార్సుల పరిష్కారం విషయంలోనూ మంత్రిత్వశాఖ గణనీయ పురోగతిని సాధించింది. పార్లమెంటు సభ్యుల మొత్తం 70 సిఫార్సులు, 18 పార్లమెంటరీ హామీలు, 14 పీఎంవో సిఫార్సులు, 3 రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సులను ప్రచారంలో భాగంగా మంత్రిత్వశాఖ విజయవంతంగా పరిష్కరించింది.

ప్రత్యేక ప్రచారం 6.0లో భాగంగా చేపట్టిన ప్రత్యేక చర్యలు... ప్రజలకు వేగంగా సేవలందించడం, సంస్థాగత జవాబుదారీతనం, సమర్థ పాలన పట్ల మంత్రిత్వశాఖ నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయి. ఈ ప్రచారం ద్వారా అంతర్గత విధులను మరింత బలోపేతం చేయడంతో పాటు, సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న అంశాలను అత్యంత వేగంగా పరిష్కరించే అవకాశం లభించింది.

మంత్రిత్వశాఖ, దాని అనుబంధ సంస్థల నిరంతర పర్యవేక్షణ, సమన్వయ ప్రయత్నాల వల్ల ఈ ప్రత్యేక ప్రచారం 6.0 కార్యక్రమం... ప్రజా ఫిర్యాదులు, ప్రభుత్వ సిఫార్సులను సకాలంలో పరిష్కరించే వ్యవస్థను మరింత బలోపేతం చేసింది. పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన, ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిచ్చే పాలన అందించడంలో 'ఆయుష్ మంత్రిత్వశాఖ' నిబద్ధతను ఈ కార్యక్రమం స్పష్టం చేస్తోంది.

# ఇండియా మైనింగ్ వీక్-2026 కోసం మీడియా రిజిస్ట్రేషన్ ప్రారంభం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 న్యూఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్ వేదికగా నవంబరు 15 నుంచి 17 వరకు జరగనున్న ప్రతిష్ఠాత్మక ఇండియా మైనింగ్ వీక్ - 2026 కవరేజీ కోసం మీడియా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు అంతర్జాతీయ స్థాయిలో జరగబోయే ఈ మెగా ఈవెంట్‌ను కవర్ చేయాలనుకునే జర్నలిస్టులు, మీడియా నిపుణులు, కంటెంట్ క్రియేటర్లు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు ప్రకటించారు.

"బలమైన వనరులు, స్మార్ట్ మైనింగ్, సుస్థిర భవిష్యత్తు" అనే థీమ్‌తో ఈ మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు జరగనుంది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన, ప్రపంచస్థాయి పోటీని తట్టుకోగల, పర్యావరణానికి హితమైన మైనింగ్ రంగాన్ని నిర్మించాలనే భారత దార్శనికతను ప్రతిబింబించేలా ఈ థీమ్‌ను ఎంచుకున్నారు. మైనింగ్, ఖనిజాల రంగంలో వస్తున్న మార్పులపై చర్చించేందుకు ఈ సదస్సు ఒక వేదికగా నిలవనుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విధాన నిర్ణేతలు, ప్రతినిధులు, మైనింగ్-ఖనిజాల కంపెనీలు, పెట్టుబడిదారులు, సాంకేతిక ఆవిష్కర్తలు, మైనింగ్ పరికరాల తయారీదారులు, పరిశోధకులు, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొని ప్రసంగించనున్నారు.

ఈ సదస్సులో ఉన్నత స్థాయి సమావేశాలు, అంతర్జాతీయ ప్రదర్శనలు, సాంకేతిక చర్చలు, పరిశ్రమ ప్రముఖుల చర్చలు, ప్రత్యేక నెట్‌వర్కింగ్ అవకాశాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మైనింగ్ రంగం భవిష్యత్తు ఎలా ఉండాలనే దానిపై ప్రధానంగా చర్చిస్తారు. ఇందులో ముఖ్యంగా ఖనిజ భద్రత, కొత్త ఖనిజాల అన్వేషణ, డిజిటలైజేషన్, ఆటోమేషన్, గనుల రక్షణ, పర్యావరణ పరిరక్షణ, అత్యంత కీలకమైన ఖనిజాలు, వనరుల సద్వినియోగం, సరికొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించనున్నారు. భారత మైనింగ్ వ్యవస్థ భవిష్యత్తు, ప్రపంచవ్యాప్తంగా ఖనిజ రంగంలో వస్తున్న మార్పులపై సమగ్రంగా చర్చించడానికి ఈ కార్యక్రమం ఒక అద్భుతమైన వేదికగా నిలవనుంది.

# నేటి తరానికి స్ఫూర్తి చాకలి ఐలమ్మ

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

హన్మకొండ, సెప్టెంబర్ 26:(నేటినిజం ప్రతినిధి)చాకలి ఐలమ్మ నేటి తరానికి స్ఫూర్తి



ప్రదాత అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. చాకలి ఐలమ్మ 131 వ జయంతి ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే రజక సంఘం నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిజాం, పెత్తందా రులు, భూస్వాముల ఆరాచ కాలకు వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటం చేశారని గుర్తు చేశారు. నాటి రోజుల్లో భూస్వాములను ఎదిరించి పోరాడిన యోధు రాలని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, సర్పంచ్ చింతల ఉమా, నాయకులు చల్లా చక్రపాణి, రేణికుంట్ల సదయ్య, లడే రాజ్ కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# సోమిడి శివారులో వరుస చోరీలు..

ఆదిలాబాద్, సెప్టెంబర్ 26: సోమిడి శివారు ప్రాంతంలో గుర్తుతెలియని దుండగులు వ్యవసాయ బావుల వద్ద చోరీలకు పాల్పడ్డారు.

రైతులకు చెందిన విద్యుత్ మోటర్లు, వైర్లు, ఇతర వ్యవసాయ ఉపకరణాలను ఎత్తుకెళ్లారు. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు.

విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా నాయకుడు కాయిత రాజ్‌కుమార్ యాదవ్ బాధిత రైతుల వ్యవసాయ బావులను పరిశీలించారు.

చోరీ జరిగిన తీరును, జరిగిన నష్టాన్ని రైతుల ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో మూడు నెలల వ్యవధిలోనే ఆరు సార్లు చోరీలు జరిగాయని తెలిపారు. ఈ ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు.

తక్షణమే చోరీలపై సమగ్ర విచారణ చేపట్టి నిందితులను గుర్తించి అరెస్టు చేయాలని, చోరీకి గురైన సొత్తును రికవరీ చేసి బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఓ రైతుకు చెందిన ట్రాక్టర్ టైర్లను కూడా దొంగలు ఎత్తుకెళ్లారని, ఆ ఘటనపై ఫిర్యాదు చేసినప్పటికీ నింది తులను గుర్తించలేకపోయారని గుర్తు చేశారు.

ఇకనైనా పోలీస్ యంత్రాంగం స్పందించి సోమిడి శివారు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని కాయిత రాజ్‌కుమార్ యాదవ్ కోరారు. వరుస చోరీలకు అడ్డుకట్ట వేసి రైతుల్లో భద్రతా భావాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆలయ విస్తరణ పనులు వేగవంతం చేయాలి..

కరీంనగర్, సెప్టెంబర్ 26: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను వేగవంతం పూర్తి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శుక్రవారం వేములవాడ పట్టణంలో వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్ అండ్ బీ, ఆలయ అధికారులతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులపై ఆరా తీశారు.పనులు వేగంగా పూర్తి చేసేందుకు కావలసిన సిబ్బందిని నియమించి పూర్తి చేయించాలని సూచించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా భక్తులకు సౌకర్యాలను అందుబా టులోకి తీసుకు రావాలని ఆదేశించారు.


ఆహ్వానం

ప్రముఖ తత్త్వకవి ఉదారి నాగదాసు స్మారక

కవితా అవార్డు ప్రదాన సభ

అవార్డు గ్రహీత

మునిమడుగుల రాజారావు

ప్రముఖ కవి, తాత్త్విక రచయిత

ముఖ్య అతిథి
డా. కుడ్మేత మనోహర్
అడిషనల్ డి.ఎమ్. & హెచ్.ఓ. ఉట్నూర్

సభాధ్యక్షులు
బాలసాని నారాయణ గౌడ్
ప్రముఖ కవి

విశిష్ట అతిథి
కోల కిరణ్ కుమార్
వైస్ ప్రిన్సిపాల్, డైట్, ఆదిలాబాద్.

ఆత్మీయ అతిథి
డా. తొడసం చందు
రిటైర్డ్ డి.ఎమ్.& హెచ్.ఓ.

ఆత్మీయ అతిథి
మన్నె ఏలియా
ప్రముఖ కథా రచయిత

ఆత్మీయ అతిథి
చిందం ఆశన్న
ప్రముఖ కవి

సమన్వయం
యు. గంగన్న
రిజ్వాన్ ఖాన్

తేది : 27-09-2026
సమయం : మ. 3-00 గం.లకు

వేదిక : జిల్లా పరిషత్ మీటింగ్ హాల్, ఆదిలాబాద్.

నిర్వాహకులు
ఉదారి కృష్ణమాచారి డా. ఉదారి నారాయణ

ఆహ్వానించువారు :
ఉదారి శేషన్న (పంతులు), ఉదారి రమేశ్,
ఉదారి దయానంద్, ఉదారి శ్రీనివాస్
(ఉదారి కుటుంబ సభ్యులు)


# పౌర్ణమి వేడుకల్లో భక్తిశ్రద్ధలతో పల్లకి సేవ..



ఆదిలాబాద్, సెప్టెంబర్ 26: నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని మెండోరా మండల కేంద్రంలో పౌర్ణమి సందర్భంగా శనివారం శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, పల్లకి సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కొలువుదీర్చి భాజాభజంత్రీల మధ్య గోవింద నామస్మరణ చేస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం పల్లకి సేవను భక్తిశ్రద్ధలతో చేపట్టారు.

ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించడంతో పాటు స్వామివారి తీర్థప్రసాదాలను తీసుకున్నారు. పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

# సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి..

## -జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 26:(నేటినిజం ప్రతినిధి): ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రాజన్న



సిరిసిల్ల జిల్లాకు రానున్నారని, పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ నెల 30వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి రాక నేపథ్యంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు.

సీఎం రేవంత్ రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, అలాగే సిరిసిల్ల రగుడు బై పాస్ రోడ్ వద్ద ఉన్న మైదానంలో పబ్లిక్ మీటింగ్ నిర్వహించనున్నారని తెలిపారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు ట్రాఫిక్, బందోబస్తు, భద్రతా చర్యలు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లోని ఎఫ్‌సీవీ పొగాకు రైతుల కోసం బార్న్‌కు రూ. 50,000 చొప్పున వడ్డీ లేని ఏకకాల రుణం మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 మారుతోన్న ప్రపంచ మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు సకాలంలో ఆర్థిక సహాయం అందించేందుకు 'వడ్డీ లేని నిర్వహణ మూలధన సహాయ పథకం' కింద ఆంధ్రప్రదేశ్‌లోని ఎఫ్‌సీవీ పొగాకు రైతులకు ఒక్కో బార్న్‌కు రూ. 50,000 చొప్పున ఏకకాల వడ్డీ లేని రుణాన్ని ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

ఆంధ్రప్రదేశ్‌లో 2025?26 పంట సీజన్‌కు సంబంధించిన వేలాలు 2026 మార్చి 25న ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు సుమారు 100 మిలియన్ కిలోల ఫ్లూ-క్యూర్డ్ వర్జీనియా (ఎఫ్‌సీవీ) పొగాకు వేలమైంది. ఎఫ్‌సీవీ పొగాకును ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో సాగు చేస్తారు.

ప్రపంచ పొగాకు మార్కెట్‌లో డిమాండ్ సరళిలో మార్పులు, భౌగోళిక రాజకీయ పరిణామాలు, మారుతున్న అంతర్జాతీయ వాణిజ్య స్థితిగతులు కొనుగోలు, మార్కెటింగ్ పరిస్థితులను ప్రభావితం చేశాయి. కొనుగోళ్లను సులభతరం చేయడానికి, మార్కెట్ భాగస్వామ్యాన్ని మెరుగు పరచడానికి, ఎగుమతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం సమన్వయ చర్యలు కూడా చేపడుతోంది.

పంటను సజావుగా మార్కెటింగ్ చేయడానికి, ఎఫ్‌సీవీ పొగాకు రంగాన్ని బలోపేతం చేయడానికి ఎగుమతిదారులు, కొనుగోలుదారులు, రైతులు, ఇతర భాగస్వాములతో నిరంతరం సంప్రదింపులు చేపడుతోంది.

ప్రతిపాదించిన ఏకకాల ఆర్థిక సహాయంలో భాగంగా ఎఫ్‌సీవీ పొగాకు రైతులకు ఒక్కో బార్న్‌కు రూ. 50,000 చొప్పున వడ్డీ లేని నిర్వహణ మూలధన సహాయాన్ని ప్రభుత్వం ఆమోదించింది.

ఈ ప్రతిపాదన దాదాపు 44,000 మంది రైతులకు వర్తిస్తుంది. దీనికోసం దాదాపు రూ. 220 కోట్ల ఆర్థిక సహాయం అందించనున్నారు. డీబీటీ ద్వారా నేరుగా రైతులకు ఈ ఆర్థిక సహాయం అందించనున్నారు.

రైతులకు తక్షణ ద్రవ్య లభ్యతను అందించటం, వారి కుటుంబ అవసరాలను తీర్చుకోవడానికి- సంస్థాగత రుణాలను తిరిగి చెల్లించడానికి వీలు కల్పించడం, వచ్చే పంట సీజన్ కోసం ఇన్‌పుట్‌లను కొనుగోలు చేయడం, ప్రైవేట్ అప్పులపై ఆధారపడటాన్ని తగ్గించాలనే ప్రధాన ఉద్దేశంతో ఆర్థిక సహాయం చేయనున్నారు. ఎఫ్‌సీవీ పొగాకు రైతులకు సకాలంలో ఆర్థిక సహాయం అందించడం ద్వారా, కార్యకలాపాలకు అవసరమైన నిధులను సమకూర్చడం ద్వారా రైతుల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను ఇది మరోసారి పునరుద్ఘాటిస్తోంది.

# న్యూఢిల్లీలో జాతీయ వ్యాపారుల సంక్షేమ బోర్డు 11వ సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 న్యూఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో జాతీయ వ్యాపారుల సంక్షేమ బోర్డు (ఎన్‌టీడబ్ల్యూబీ) 11వ సమావేశం హైబ్రిడ్ విధానంలో జరిగింది. వ్యాపారుల సంక్షేమం, వ్యాపార సౌలభ్యం, డిజిటల్ సాధికారత, రుణాల లభ్యత, కేంద్ర-రాష్ట్ర సమన్వయం, ఎగుమతుల ప్రోత్సాహం తదితర అంశాలను బోర్డు సమీక్షించింది. జీఎస్‌టీ, ఎంఎస్ఎంఈలు, వ్యాపారుల ఫిర్యాదు పరిష్కారం, డిజిటల్ వేదికలకు సంబంధించిన అంశాలను చర్చించారు. అలాగే వ్యాపారులు, చిన్న వ్యాపారులు, తయారీదారులు, ఎగుమతిదారులు, సర్వీసు ప్రొవైడర్లకు సంస్థాగత మద్దతును బలోపేతం చేయడం లాంటి అంశాలపై సైతం చర్చించారు.

హేతుబద్ధీకరణ, రీఫండులో జాప్యాలు, సుదీర్ఘ ఆడిట్‌లు, కారుణ్య పథకాలు, ఐటీసీ అవకతవకలు, పెండింగులో ఉన్న అప్పీళ్ల పరిష్కారంతో సహా జీఎస్టీ సంబంధిత అంశాలపై సభ్యులు చర్చించారు. ఎంఎస్ఎంఈ సదుపాయాల కమిటీల్లో వ్యాపారులను చేర్చడం, 30 రోజుల కాలపరిమితితో కూడిన కేంద్రీకృత రుణ పోర్టల్ ప్రతిపాదన, సిబిల్ స్కోర్ వ్యవస్థలో సంస్కరణలు, వ్యాపారుల ఫిర్యాదుల హెల్ప్‌లైన్‌ల ఏర్పాటు అంశాలపై ఎంఎస్ఎంఈ, ఆర్థిక సంబంధ చర్చల్లో చర్చించారు.

ప్రభుత్వ కాంట్రాక్టర్లకు సకాలంలో చెల్లింపులు, సాంకేతిక కారణాలతో విధించే జరిమానాల నుంచి రక్షణ, వ్యాపారాలు మందగించిన సమయాల్లో రుణాల చెల్లింపులో వెసులుబాటు, కేంద్ర-రాష్ట్రాల మధ్య మరింత మెరుగైన సమన్వయం లాంటి వ్యాపార సంక్షేమ అంశాలపైనా సభ్యులు చర్చించారు. డిజిటల్ సాధికారతకు సంబంధించి ఓఎన్‌డీసీ, డిజిదుకాణ్ సేవలను జిల్లా స్థాయికి విస్తరించడం, నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తల సదుపాయ డెస్కుల ఏర్పాటు, ఫిర్యాదుల పరిష్కారానికి పోష్ సెల్స్‌తో పాటు సైబర్ మోసాల పరిష్కార యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయడంపై బోర్డు విస్తృతంగా చర్చించింది.

ఎగుమతుల్లో వ్యాపారులు, ఎంఎస్ఎంఈల భాగస్వామ్యాన్ని పెంచడం, ఎగుమతి అవకాశాలపై అవగాహనను పెంపొందించడం, సంస్థాగత సహాయక వ్యవస్థలను బలోపేతం చేయడం, అంతర్జాతీయంగా పోటీనిచ్చే వాణిజ్య దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. వివిధ రంగాల వారీగా సమస్యలను లోతుగా పరిశీలించి, విధానపరమైన నిర్ణయాల కోసం నిర్మాణాత్మక సిఫారసులను అందించేందుకు వీలుగా నిర్దిష్ట అంశాలవారీ కమిటీలు, ప్రత్యేక వర్కింగ్ గ్రూపులను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతపై కూడా బోర్డు చర్చించింది.

ఈ సమావేశానికి ఎన్‌టీడబ్ల్యూబీ ఛైర్మన్ శ్రీ సునీల్ జె సింఘీ అధ్యక్షత వహించారు. నిర్దేశిత బోర్డు లక్ష్యాలను చేరుకోవడానికి చేపట్టిన ప్రధాన కార్యక్రమాల గురించి ఆయన వివరించారు. 40,000 నిబంధనలను హేతుబద్ధీకరించిన జన్ విశ్వాస్ చట్టం, సులభతర వాణిజ్య చర్యలు, మధ్యప్రదేశ్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడులో రాష్ట్ర వ్యాపారుల సంక్షేమ బోర్డుల ఏర్పాటు వంటి సంస్కరణల ద్వారా వ్యాపార సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీ సింఘీ తెలిపారు. ఇదే అంశంపై గోవా, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన లిఖితపూర్వక ఆమోదాలను, జిల్లా సదుపాయ కేంద్రాల ఏర్పాటులో సాధించిన పురోగతిని కూడా బోర్డు పరిగణనలోకి తీసుకుంది.

కేంద్ర-రాష్ట్రాల మధ్య అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తూ వరుసగా 100 వర్చువల్ సమావేశాలను విజయవంతంగా నిర్వహించిన అంశాన్ని శ్రీ సింఘీ ప్రస్తావించారు. స్వదేశీ జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో జూన్ 29న భామాషా జయంతిని రాష్ట్రీయ వ్యాపారి దివస్‌గా నిర్వహించడం, డెహ్రాడూన్, ఇండోర్ నగరాల్లో జరిగిన వ్యాపారి సంవాద్, చండీగఢ్, ఇండోర్‌లో చేపట్టిన తిరంగా యాత్ర తదితర కార్యక్రమాలు, ప్రచారాల గురించి కూడా ఆయన వివరించారు.

తర్వాతి తరం జీఎస్టీ 2.0 సంస్కరణలు, ఓఎన్‌డీసీ అనుసంధానం, డిజిదుకాన్ విస్తరణకు సంబంధించి సాధించిన పురోగతులను కూడా ఛైర్మన్ సభ్యులకు వివరించారు. ఓఎన్‌డీసీ చేపట్టిన బీ2బీ కొనుగోళ్లు, కిరాణా డిజిటలైజేషన్ కార్యక్రమం డిజిదుకాణ్. దీని ద్వారా కిరాణా దుకాణాలు ఒకే ఆర్డరింగ్ ఇంటర్‌ఫేస్ సాయంతో సరకుల కొనుగోలు ప్రక్రియను డిజిటలైజ్ చేసుకునే వీలు కలుగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్, జైపూర్ నగరాల్లో 19,000 మందికి పైగా రీటైలర్లు ఈ వేదికను వినియోగిస్తున్నారు.

సమావేశం ప్రారంభంలో డీపీఐఐటీ డైరెక్టర్ శ్రీ యువరాజ్ రవీంద్ర పాటిల్ బోర్డు సభ్యులతో పాటు వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలకు చెందిన ఎక్స్-అఫీషియో సభ్యులకు స్వాగతం పలికారు. అనంతరం జాతీయ వ్యాపారుల సంక్షేమ బోర్డు లక్ష్యాలు, విధులను వివరించారు. బోర్డు చేపడుతున్న కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు, డీపీఐఐటీ నిర్వహించే ఇంటరాక్టివ్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశాల వివరాలు అందరికీ చేరేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో 2027 జనవరి 1 నుంచి అమల్లోకి తెచ్చేందుకు ప్రతిపాదించిన వినియోగదారుల రక్షణ (సవరణ) బిల్లు-2026తో సహా త్వరలో రానున్న పలు సంస్కరణలను సభ్యులకు వివరించారు. ఎగుమతుల ప్రోత్సాహానికి ప్రాధాన్యమిస్తూ, భారత్-యూకే సీఈటీఏ చర్చలపైనా బోర్డు విస్తృత చర్చలు చేపట్టింది.

ఈ సమావేశానికి వాణిజ్య సంఘాలు, రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న నాన్-అఫీషియల్ సభ్యులతో పాటు భారత ప్రభుత్వానికి చెందిన వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల ఎక్స్-అఫీషియో సభ్యులు హాజరయ్యారు.

విధానపరమైన మద్దతు, డిజిటల్ సాధికారత, సులభతర వాణిజ్య సంస్కరణలు, సామాజిక భద్రతా కార్యక్రమాలు, కేంద్ర-రాష్ట్రాల మధ్య మరింత దృఢమైన సమన్వయం ద్వారా వ్యాపారులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు బోర్డు కట్టుబడి ఉందని పునరుద్ఘాటిస్తూ సమావేశం ముగిసింది. వ్యాపారులు, వారి ఉద్యోగుల సంక్షేమం, సాధికారత కోసం కృషి చేయడంతో పాటు వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో చురుగ్గా పాల్గొనాలనే సంకల్పాన్ని బోర్డు మరోసారి స్పష్టం చేసింది.

# వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం..

ఖమ్మం, సెప్టెంబర్ 26: తెలంగాణ నేల సాధించిన ధైర్యసాహసాలకు, విప్లవ స్ఫూర్తికి ప్రతీక వీరనారి చాకలి ఐలమ్మ అని ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు పేర్కొన్నారు. ఆమె చూపిన పోరాట పటిమ, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి తరతరాలకు ఆదర్శనీయమని అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఆమె జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆమె పోరాట స్ఫూర్తిని, సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నైజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి తెలంగాణ రైతాంగ ఉద్యమంలో నారీ శక్తిని చాటి చెప్పిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయిందన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చూపిన ధైర్యం, పట్టుదల, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సామాజిక సమానత్వం, న్యాయం కోసం ఆమె చేసిన కృషి నేటి సమాజానికి కూడా ఎంతో దిశానిర్దేశం చేస్తుందని తెలిపారు. ఐలమ్మ ఆశయాలను స్మరించుకోవడంతో పాటు వాటి సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనిల్‌కుమార్‌తో పాటు వివిధ విభాగాల మున్సిపల్ అధికారులు, సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మకు నివాళులు అర్పించారు.

# ప్రధానమంత్రి జ్ఞాపికల ఇ-వేలం 2026'లో ఒడిషా సుసంపన్న సాంస్కృతిక వారసత్వ వైభవం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26: ప్రధానమంత్రి జ్ఞాపికల ఇ-వేలం 2026 ఈసారి ఒడిషా వైవిధ్య భరిత సాంస్కృతిక వారసత్వం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఇందులో భక్తి, హస్తకళలు, చిత్రలేఖనం, వస్త్రాలు, సాహిత్యం తదితర రాష్ట్ర సంప్రదాయాలను చాటిచెప్పే కళాఖండాలున్నాయి. ఈ వేలం వస్తువుల జాబితాలో జగన్నాథ, బలభద్ర, సుభద్రా దేవి ప్రతీకలైన రకరకాల కళాఖండాలు సహా ప్రాంతీయ దేవతలు, సంప్రదాయ కళారూపాలు, వస్త్రాలు, పండుగలు, ప్రముఖ సాంస్కృతిక మహనీయుల ప్రతిరూపాలు కూడా ఉన్నాయి.

ఈ కళాఖండాల్లో 'జగన్నాథ పరివారం రథంపై ఊరేగే' చిత్రం అత్యంత ఆకర్షణీయమైనదిగా నిలిచింది. ఈ చిత్రంలో జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రా దేవి అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన రథంపై ఆసీనులై ఉంటారు. ఈ రథాన్ని నాలుగు గుర్రాలు లాగుతున్నట్లుగా చిత్రించారు. ఇది జగన్నాథ రథయాత్ర సాంస్కృతిక-ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని చాటే చిత్రం.

వీటిలో పూరీ రథయాత్రను వర్ణించే ఒక పట్టచిత్ర పెయింటింగ్ కూడా ఉంది. ఇది సంగీత-నృత్యోత్సవాల నడుమ రథంలో ఉన్న దేవతలను ప్రతిబింబిస్తుంది.

ఒడిషా భక్తి- కళా సంప్రదాయాలు ముడిపడిన తీరును ఈ చిత్రంలోని సంక్లిష్ట అంశాలు, ఉజ్వల వర్ణాలు అద్భుతంగా కళ్లకు కడతాయి.

వేలం వేసే వస్తువుల జాబితాలో రాష్ట్రానికి సంబంధించిన అనేక సంప్రదాయ హస్తకళా ఉత్పత్తులు కూడా ఉన్నాయి. సున్నితమైన వెండి తీగలతో కూడిన సంక్లిష్ట కటక్ వెండి ఫిలిగ్రీ లేదా తారకాసి, సంబల్పురి వస్త్రాలు, ఇకాట్ వంటివి ఉన్నాయి.

సంబల్పూరి ఇకాట్‌తో రూపొందించిన సమాలేశ్వరి మాత కళాఖండం భక్తికి చిహ్నంగా నిలుస్తుంది. ఈ కళాకృతిని పూర్తి సంప్రదాయ బంధా పద్ధతిలో చేతితో నేశారు.

జగన్నాథుని ఇతివృత్త కళాఖండాలతో పాటు ఒడిషా రాష్ట్ర ఉజ్వల పండుగల సంప్రదాయాలను కూడా ఇ-వేలం ప్రతిబింబించింది. ఫ్రేమ్ కట్టిన ఒక ప్రింట్ పంచూ డోలా మేళాను ప్రదర్శిస్తుంది. ఇందులో రంగు రంగుల చిన్న ఆలయ రూపాలను మోసుకెళ్లే భక్తులు కనిపిస్తారు. మరో ఫొటో చిలికా సరస్సు వద్ద వేడుకలను వివరిస్తుంది. ఇందులో వార్షిక సమావేశం కోసం గ్రామ దేవతలను తీసుకెళ్లే పడవలు కనిపిస్తాయి.

మొత్తం 62 జ్ఞాపికలు జగన్నాథ పూజ, రథయాత్ర వంటి శాశ్వత సంప్రదాయాలు సహా పట్టచిత్ర, తారకాసి, సంబల్పూరి ఇకాట్, ప్రాంతీయ పండుగలు, సాహితీ వారసత్వం దాకా ఒడిషా విస్తృత కథనాన్ని కనులముందు నిలుపుతాయి. కేవలం ఒకే కళా సంప్రదాయం కాకుండా రాష్ట్ర సజీవ సాంస్కృతిక వారసత్వాన్ని చాటే దిన బహుళ వ్యక్తీకరణల ప్రతీకలను ఈ జాబితా మన ముందుంచుతుంది.

# పీఈటీపై వేధింపుల ఆరోపణలు.. హైస్కూల్ వద్ద తల్లిదండ్రుల ఆందోళన



ఖమ్మం, సెప్టెంబర్ 26:ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుదిమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఈటీ వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలపై విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ఆందోళన చేపట్టారు. గత వారం రోజులుగా పాఠశాల పీఈటీ తమను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ 16 మంది విద్యార్థినులు సంతకాలతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి వినతిపత్రం అందించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. అయితే ఫిర్యాదు చేసినప్పటికీ పీఈటీపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ విద్యార్థినులు తల్లిదండ్రులతో కలిసి పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు.

విషయం తెలుసుకున్న ఎంఈఓ శ్రీనివాస్ పాఠశాల వద్దకు చేరుకుని వివరాలను అడిగి తెలుసుకుని విచారణ చేపట్టారు. అనంతరం ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థినుల ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి పీఈటీపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

# అంగన్వాడీ కేంద్రంలో వసతులను పరిశీలించిన చైర్‌పర్సన్



ఖమ్మం, సెప్టెంబర్ 26: వైరా మున్సిపాలిటీ 6వ వార్డులోని అంగన్వాడీ కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని వసతులు, చిన్నారులకు అందుతున్న సేవలను పరిశీలించారు.

పిల్లల సంరక్షణ, పోషకాహారం, మౌలిక వసతులపై అంగన్వాడీ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం చిన్నారులకు ఆహారం అందిస్తున్నారా? అనే విషయాన్ని పరిశీలించారు. పిల్లలకు డ్రెస్ విషయంలో కూడా శ్రద్ధ వహించాలని, అంగన్వాడీ కేంద్రం పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.

అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, ప్రస్తుతం ఎంతమంది చిన్నారులు కేంద్రానికి హాజరవుతున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం 6వ వార్డులోని డ్రెయిన్ పనులను చైర్‌పర్సన్ పరిశీలించారు. డ్రెయిన్ కొలతలు వేయించి పనులను దగ్గరుండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు లగడపాటి ప్రభాకర్‌రావు, తోటకూర శ్రీకాంత్, మున్సిపల్ వర్కర్ గజ్జల శీను తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ కనెక్టివిటీ రేటింగ్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించిన ట్రాయ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26: డిజిటల్ కనెక్టివిటీ రేటింగ్ (డీసీఆర్) ప్లాట్‌ఫామ్‌ను భారతీయ టెలికాం నియంత్రణ మండలి (ట్రాయ్) ఈ రోజు ప్రారంభించింది. ప్రాపర్టీల డిజిటల్ రేటింగ్ సమాచారాన్ని వినియోగదారులకు అందించేందుకు, భవనాల డిజిటల్ కనెక్టివిటీకి రేటింగ్ ఇచ్చే సమగ్ర ప్రక్రియను సులభతరం చేసేందుకు దీన్ని తీసుకొచ్చారు. ఇందులో భాగంగా డిజిటల్ కనెక్టివిటీని పరీక్షించే యాప్‌ను కూడా విడుదల చేశారు.

2024 మే 13న ట్రాయ్ నోటిఫై చేసిన 'టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (రేటింగ్ ఆఫ్ ప్రాపర్టీస్ ఫర్ డిజిటల్ కనెక్టివిటీ) రెగ్యులేషన్స్-2024', 2026 మే 13న జారీ చేసిన దాని సవరణ నిబంధన-2026, 2026 జూన్ 9న ట్రాయ్ విడుదల చేసిన 'రేటింగ్ మాన్యువల్ 2026'లో పేర్కొన్న మార్గదర్శకాల అమలును ఈ డీసీఆర్ ప్లాట్‌ఫామ్ సులభతరం చేస్తుంది.

ఈ ప్లాట్‌ఫామ్ డిజిటల్ కనెక్టివిటీ రేటింగ్ పొందిన ప్రాపర్టీలను వినియోగదారులు చూసేందుకు ఒక పబ్లిక్ ఇంటర్‌ఫేస్‌ను అందిస్తుంది. ఇది ప్రాపర్టీ మేనేజర్లు (పీఎం), రిజిస్టర్డ్ డిజిటల్ కనెక్టివిటీ రేటింగ్ ఏజెన్సీ (డీసీఆర్‌ఏ), వినియోగదారులను ఒకే ఉమ్మడి డిజిటల్ వేదికపైకి తీసుకువస్తుంది. ప్రాపర్టీ మేనేజర్లు తమ ప్రాపర్టీలను ప్రజా, ప్రభుత్వ, వాణిజ్య, ప్రైవేట్ మొదలైన విభాగాలలో రిజిస్టర్ చేసుకోవటం, రేటింగ్ దరఖాస్తులను సమర్పించటం, నిర్దేశిత సమాచారాన్ని- పత్రాలను అప్‌లోడ్ చేయటం, డీసీఆర్‌ఏను ఎంచుకోవటం చేయచ్చు. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా తమ దరఖాస్తు పురోగతిని కూడా ట్రాక్ చేసుకోవచ్చు. నిర్మాణం పూర్తైన వాటితో పాటు నిర్మాణంలో ఉన్న వాటికి కూడా నిర్దేశిత మదింపు ప్రక్రియను ఇది అందిస్తోంది. నమోదిత డీసీఆర్‌ఏలు కేటాయించిన దరఖాస్తులను పరిశీలించటం, మదింపులను నిర్వహించటం, పరిశీలనలు- పరీక్ష ఫలితాలను రికార్డ్ చేయటం, సంబంధిత(సపోర్టింగ్) దస్త్రాలను నిర్వహించటం, నిర్దేశిత ఫ్రేమ్‌వర్క్ ప్రకారం రేటింగ్ ప్రక్రియను పూర్తి చేయటం చేయొచ్చు. ఈ ప్లాట్‌ఫామ్ మదింపు, నివేదిక తయారీ, ధ్రువీకరణ, రేటింగ్‌ల ప్రచురణకు సంబంధించిన డిజిటల్ ప్రక్రియను ప్రారంభిస్తుంది. వినియోగదారులు, ఇతర సంబంధిత వర్గాలు రేటింగ్ పొందిన ప్రాపర్టీలను వెతికేందుకు, ప్రచురించిన రేటింగ్‌లను వీక్షించడానికి, సంబంధిత పత్రాలను ధ్రువీకరించడానికి, ఆసక్తి ఉన్న భవనాలను సరిపోల్చుకునేందుకు ఇది వీలు కల్పిస్తుంది.

క్షేత్రస్థాయి మదింపుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన డీసీఆర్‌ఏ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. నిర్దేశిత పరీక్షా విధానానికి అనుగుణంగా అధీకృత డీసీఆర్‌ఏలు భవనాల లోపల డిజిటల్ కనెక్టివిటీని అంచనా వేసేందుకు ఈ యాప్ వీలు కల్పిస్తుంది. వెబ్ పోర్టల్ ద్వారా అందిన భవనాల సమాచారం, మొబైల్ అప్లికేషన్ ద్వారా సేకరించిన మదింపు డేటా ఈ ప్లాట్‌ఫామ్‌లో అనుసంధానమవుతుంది. దస్త్రాలు, ధ్రువీకరణ పత్రాలపై డిజిటల్ సంతకం చేయడానికి, వాటిని ధ్రువీకరించడానికి ఈ ప్లాట్‌ఫామ్ 'ఈ-సైన్' సౌకర్యాన్ని కలిగి ఉంది. వర్తించే రేటింగ్ ఫీజులను ఆన్‌లైన్‌లో చెల్లించటం, ఈమెయిల్- ఎస్ఎంఎస్ అలర్ట్‌లు, ప్రాపర్టీ రికార్డులు, పరీక్ష ఫలితాలు, ధ్రువీకరణ పత్రాలు, ఆడిట్ లాగ్‌ల సురక్షిత భద్రతకు ఇది పూర్తి మద్దతునిస్తుంది.

వినియోగదారుల కోసం ఈ ప్లాట్‌ఫామ్ ఒక పబ్లిక్ రేటింగ్ సెర్చ్ పేజీని అందిస్తుంది. వినియోగదారులు ప్రాపర్టీ పేరు, సర్టిఫికెట్ ఐడీ లేదా లొకేషన్ ఆధారంగా రేటింగ్ పొందిన ప్రాపర్టీని వెతుక్కోవచ్చు. వారు భవనానికి సంబంధించిన డిజిటల్ సంతకం చేసిన రేటింగ్ ధ్రువీకరణ పత్రాన్ని చూడొచ్చు. ఆ ధ్రువీకరణ పత్రంపై ఉండే క్యూఆర్ కోడ్ ద్వారా దాని ప్రామాణికతను తెలుసుకోవచ్చు. దీనివల్ల రేటింగ్ పొందిన ప్రాపర్టీలో డిజిటల్ కనెక్టివిటీ అనేది స్పష్టంగా కనిపించే, ధ్రువీకరించదగిన అంశంగా మారుతుంది. తద్వారా వినియోగదారులకు కనెక్టివిటీ సమాచారం అందుబాటులోకి వస్తుంది. ఈ సమాచారం ఆధారంగా వినియోగదారులు తుది కొనుగోలు లేదా లీజు నిర్ణయం తీసుకునే ముందు తమకు కావాల్సిన ప్రాపర్టీని ఎంపిక చేసుకునేటప్పుడు సరైన నిర్ణయం తీసుకోవచ్చు.

ఈ సందర్భంగా ట్రాయ్ ఛైర్మన్ శ్రీ అనిల్ కుమార్ లహోటి మాట్లాడుతూ "డిజిటల్ కనెక్టివిటీ రేటింగ్ ప్లాట్‌ఫామ్ ప్రాపర్టీల డిజిటల్ కనెక్టివిటీ సన్నద్ధతను అంచనా వేయడానికి ఒక పారదర్శకమైన, ప్రామాణికమైన ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పరుస్తుంది. రేటింగ్ వివరాలను ప్రజలకు అందుబాటులోకి తేవడం, సర్టిఫికెట్లను సులభంగా పరిశీలించే వెసులుబాటు కల్పించడం ద్వారా ఈ ప్లాట్‌ఫామ్ వినియోగదారులకు నమ్మకమైన, పోల్చుకునేందుకు వీలైన సమాచారాన్ని అందిస్తుంది. బలమైన, నమ్మదగిన కనెక్టివిటీ ఉన్న ఇళ్లు, కార్యాలయాల గురించి మరింత సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి ఇది వారికి సహాయపడుతుంది. అంతరాయం లేని కాల్స్, డౌన్‌లోడ్‌లు, ఆన్‌లైన్ సేవల వినియోగానికి ఇది తోడ్పడుతుంది. ప్రాపర్టీలో నిర్మించిన డిజిటల్ కనెక్టివిటీ మౌలిక సదుపాయాల విలువను వినియోగదారులు గుర్తించేలా ఇది వీలు కల్పిస్తుంది.

అదే సమయంలో ప్రాపర్టీ అభివృద్ధికి తగిన దశలోనే అటువంటి మౌలిక సదుపాయాలను ప్లాన్ చేసుకోవడానికి ప్రాపర్టీ మేనేజర్లను ఇది ప్రోత్సహిస్తుంది" అని వ్యాఖ్యానించారు.



# వికసిత భారత్ దార్శనికతను ముందుకు నడిపిస్తున్న ఆవిష్కరణల వృద్ధి - శ్రీ ప్రహ్లాద్ జోషి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి ఈ రోజు బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) లో దక్షిణ ప్రాంత సేవా ఆధారిత ఆవిష్కరణ పోటీ (సేవా ఫస్ట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ - ఎస్ఎఫ్ఐసీ) ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమాజంలోని నిజమైన సమస్యలను గుర్తించి, వాటికి ఆచరణాత్మకమైన, సమర్థవంతమైన పరిష్కారాలను కనుగొనడానికి యువత సేవా భావాన్ని ఆవిష్కరణలతో జోడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది వికసిత భారత్ 2047 స్వప్నాన్ని సాకారం చేయడంలో యువత భాగస్వామ్యానికి, సహకారానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సేవా ఫస్ట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ వెబ్‌సైట్‌నూ, రిజిస్ట్రేషన్ పోర్టల్‌నూ కూడా మంత్రి ఆవిష్కరించారు.

మంత్రి మాట్లాడుతూ, "సేవ అనేది మాటల్లో కాకుండా చేతల్లో కనిపించాలి" అని అన్నారు. ఒక సమస్యను అర్థం చేసుకుని, దానికి అందరికీ ఉపయోగపడే విధంగా ఒక వినూత్నమైన పరిష్కారాన్ని కనుగొనడమే సేవ ముఖ్యమైన రూపమని ఆయన స్పష్టం చేశారు. భారత్ కు జనాభా పరంగా ఉన్న సానుకూల అవకాశాలను ప్రస్తావిస్తూ, దేశ జనాభాలో దాదాపు 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారేనని శ్రీ జోషి తెలిపారు. ఉత్సుకతతో, ఆత్మవిశ్వాసంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని సులభంగా వినియోగించగల యువతరం భారత్‌లో ఉందని ఆయన అన్నారు. యువతలోని ఆ ఉత్సాహాన్ని ప్రయోజనకరమైన కార్యాచరణగా మలచుకునేందుకు వారికి తగిన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన పేర్కొన్నారు.

జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 ప్రాముఖ్యతను, పాత్రను ప్రస్తావిస్తూ, విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, అనుభవపూర్వక అభ్యాసం, సమస్యల పరిష్కార విధానాలను ఎన్ఈపీ విద్యకు ప్రధాన సూత్రాలుగా మార్చిందని శ్రీ ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. ఈ ఆలోచన వల్ల విద్యార్థులు చిన్న వయస్సు నుంచే కొత్త విషయాలను పరిశోధించడానికి, సృష్టించడానికి, ఆవిష్కరించడానికి అనేక అవకాశాలు లభిస్తున్నాయని ఆయన వివరించారు. 10,000 పైగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, దాదాపు 17,300 ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిళ్లు, స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ వంటి కార్యక్రమాల ద్వారా ఒక బలమైన ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని కూడా ఆయన ప్రస్తావించారు.

'సేవ' స్ఫూర్తితో చేసే ఆవిష్కరణలు 'వికసిత భారత్ - 2047 స్వప్నాన్ని సాకారం చేయడంలో అర్థవంతమైన సహకారాన్ని అందిస్తాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ ఛాలెంజ్ ద్వారా వెలుగులోకి వచ్చే యువ ఆవిష్కర్తలతో కలిసి పనిచేయాలని ఆయన అంకుర పరిశ్రమలకు, పరిశ్రమల భాగస్వాములకు పిలుపునిచ్చారు. భావి మార్గదర్శకత్వం, పరిష్కారాల స్వీకరణ, విస్తరణకు మద్దతు ఇచ్చేలా ఎస్ఎఫ్ఐసీ వెబ్‌సైట్ ద్వారా ఒక జాతీయ భాండాగారాన్ని ప్రారంభించాలని ఆయన ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన ఐఐఎస్సీ బెంగళూరు, ఇతర విద్యాసంస్థలు, అధ్యాపకులు, అంకుర పరిశ్రమలు, ఇతర వాటాదారులందరినీ ఆయన అభినందించారు. డిసెంబర్ 2026లో న్యూఢిల్లీలో జరిగే జాతీయ ఫినాలేలో దేశం నలుమూలల నుంచి అత్యుత్తమ పరిష్కారాలు వస్తాయని ఆశిస్తున్నట్టు ఆయన తెలిపారు.

బెంగళూరులోని ఐఐఎస్సీ దక్షిణ ప్రాంత నోడల్ సంస్థగా వ్యవహరిస్తూ కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి, అండమాన్-నికోబార్ దీవులు, లక్షద్వీప్ ప్రాంతాల్లో సాంకేతిక మూల్యాంకనం, మార్గదర్శకత్వానికి సహకారం అందిస్తుంది.

ఎస్ఎఫ్ఐసీ కార్యక్రమం పాఠశాలలు, ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులను, యువ ఆవిష్కర్తలను ఐదు జాతీయ ఇతివృత్తాలు (1. స్వచ్ఛ, సుస్థిర భారత్ 2. సంపన్న రైతులు, సంపన్న భారత్ 3. ఆరోగ్య, సమ్మిళిత భారత్ 4. విద్య, నైపుణ్య భారత్ 5. సురక్షిత భారత్), రెండు పరిష్కార మార్గాలు (ట్రాక్ ఏ - ప్రొడక్ట్ లేదా టెక్నాలజీ సొల్యూషన్, ట్రాక్ బీ - బిజినెస్ మోడల్ లేదా గవర్నెన్స్ సొల్యూషన్) ఆధారంగా ఒకే వేదికపైకి తీసుకువస్తుంది. సృజనాత్మక ఆలోచనలను కేవలం దరఖాస్తు సమర్పణలకే పరిమితం చేయకుండా తగిన మార్గదర్శకత్వం, ఇంక్యుబేషన్, ఆచరణాత్మక అమలుకు మార్గాలను సుగమం చేయడం ఈ పోటీ ప్రధానోద్దేశం. ఈ పోటీకి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 24, 2026 వరకు అందుబాటులో ఉంటుంది. గ్రాండ్ నేషనల్ ఫినాలే డిసెంబర్ 2026లో న్యూఢిల్లీలో జరుగుతుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు డైరెక్టర్ ప్రొఫెసర్ గోవిందన్ రంగరాజన్, ఉన్నత విద్యా శాఖ అదనపు కార్యదర్శి శ్రీ ఆనంద రావు వి. పాటిల్, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కార్యదర్శి ప్రొఫెసర్ శ్యామ రథ్‌లతో పాటు ఎన్ఐటీలు, ఇతర సంస్థల డైరెక్టర్లు, ప్రతినిధులు, అధ్యాపకులు, పరిశ్రమలు, స్టార్టప్ రంగ ప్రతినిధులు; విద్యార్థులు, యువ ఆవిష్కర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


# భక్తిశ్రద్ధల మధ్య గణనాథుడి శోభాయాత్ర

## రూ.3.10 లక్షలకు లడ్డూ ప్రసాదం సొంతం

## వేలంలో పాల్గొన్న భక్తులు.. వేదమంత్రోచ్ఛారణల నడుమ వైభవంగా నిమజ్జన యాత్ర

నల్గొండ, సెప్టెంబర్ 26: చౌటుప్పల్ మున్సిపాలిటీ మూడో వార్డు లింగోజిగూడెం హనుమాన్‌నగర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడికి శుక్రవారం రాత్రి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా స్వామివారి లడ్డూ వేలం పాట నిర్వహించగా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక భక్తులు పర్నే రవీందర్‌రెడ్డి?ధనమ్మ దంపతులు రూ.3.10 లక్షలకు లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు. స్వామివారికి సమర్పించిన ఫలహారాలు, పండ్లను పర్నే మల్లారెడ్డి?మాధవి దంపతులు వేలంలో దక్కించుకున్నారు. అనంతరం వేదమంత్రోచ్చారణలు, బాణసంచా కాల్పులు, భక్తుల జయజయధ్వానాల నడుమ గణనాథుడి శోభాయాత్ర వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వీరనారికి నివాళి



నల్గొండ, సెప్టెంబర్ 26: బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని మండల ,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ బాలరాజు గౌడ్,బద్ధం నాగార్జున రెడ్డి లు అన్నారు. శనివారం మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో చాకలి ఐలమ్మ 131 వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూమి,భుక్తి, విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం లో ఐలమ్మ ముందువరుసలో నిల్చొని తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ధీరవనిత ఐలమ్మ అని కొనియాడారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు డా గుర్రం లక్ష్మి నర్సింహారెడ్డి,జిల్లా కార్యదర్శి కూరేళ్ల శ్రీరాములు, నాయకులు గనగాని నర్సయ్య, అవిశెట్టి స్వామి,మాజీ కౌన్సిలర్ పురుగుల వెంకన్న,పాలడుగు సర్పంచ్ అంతటి భగవంతు, పల్లపు సమ్మయ్య,అర్ధ ప్రతాప్ రెడ్డి, జంగ వెంకట్ నర్సు,అన్నెపు నర్సింహా, మండల ,పట్టణ మహిళా అధ్యక్షురాలు ముద్దం జయశ్రీ,అన్నెపు పద్మ తదితరులు పాల్గొన్నారు.

# సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



నల్గొండ, సెప్టెంబర్ 26:ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మహోత్సవం కార్యక్రమం శనివారం నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పు దినుసులతో తయారు చేసిన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ఇవ్వడం వల్ల వారు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ చింతపల్లి ప్రాజెక్టు సీడీపీఓ సక్కుబాయి అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చింతపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నాంపల్లి, మర్రిగూడెం, చింతపల్లి, మండలాల పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న ఆహారం విలువలను సీడీపీఓ సక్కుబాయి వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్లు, ఆయా పోస్టుల కోసం మొదటి విడతలో నోటిఫికేషన్ జారీ చేయగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఇంటర్మీడియట్ క్వాలిఫికేషన్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని, ఇంటర్మీడియట్‌లో వచ్చిన మార్కులతో పాటు ఇంటర్వ్యూలో పది మార్కుల ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు ఇప్పటికే చండూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరిగాయి. మరో విడత నోటిఫికేషన్ ద్వారా మిగతా ఖాళీలను భర్తీ చేయడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో నాంపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణ శర్మ, తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, అంగన్వాడి టీచర్లు లలిత ఎదుళ్ల తెరిసా,ఝాన్సీ, జ్యోతి, మెగావత్ కవిత, సరస్వతి, నాంపల్లి ఇందిరమ్మ, లక్ష్మి, నవనీత, తదితరులు పాల్గొన్నారు.

# ముంబై విమానాశ్రయంలో సుమారు రూ. 15 కోట్ల విలువైన 9.40 కిలోల విదేశీ బంగారాన్ని పట్టుకున్న డీఆర్ఐ - ముగ్గురు అరెస్టు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 26:బంగారం అక్రమ రవాణాను అరికట్టే పటిష్టమైన చర్యల్లో భాగంగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) ముంబై జోనల్ యూనిట్ కచ్చితమైన సమాచారం ఆధారంగా ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ముగ్గురు భారతీయ ప్రయాణికులను అడ్డుకుంది. దుబాయ్ నుంచి ముంబై విమానాశ్రయానికి 23.09.2026 తెల్లవారుజామున చేరుకున్న వారిని. ముంబై విమానాశ్రయ కస్టమ్స్ విభాగానికి చెందిన ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఏఐయూ) సహకారంతో డీఆర్ఐ అధికారులు తనిఖీ చేశారు.

వారి లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, బంగారం స్మగ్లింగ్ కోసం వారు ఉపయోగించిన అత్యంత సంక్లిష్టమైన, వినూత్నమైన మార్గం బయటపడింది. అధికారుల తనిఖీల నుంచి తప్పించుకోవడానికి విదేశీ బంగారాన్ని మెత్తటి పొడిగా మార్చి అదే రంగు, పరిమాణం, ఆకృతి కలిగిన ప్యాక్ చేసిన ఆహార పదార్థాలలో చాలా తెలివిగా కలిపినట్లు తేలింది.

పాల పొడి, ఓట్స్, పలు రకాల పిండి, నుటెల్లా, కొబ్బరి పాల పొడి వంటి సాధారణమైనవిగా కనిపించే అనేక ఆహార ప్యాకెట్లలో ఈ బంగారు పొడి దాచినట్లు కనుగొన్నారు. ఈ ముగ్గురు ప్రయాణికుల లగేజీ నుంచి మొత్తం సుమారు 33.50 కిలోల బంగారు పొడి కలిపిన ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

జాగ్రత్తగా వేరుచేసి, నాణ్యతా పరీక్షలు నిర్వహించిన తర్వాత, కస్టమ్స్ చట్టం, 1962లోని సంబంధిత నిబంధనల ప్రకారం సుమారు రూ. 14.81 కోట్ల విలువైన 9.40 కిలోల విదేశీ బంగారాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణ సమయంలో, ఒకే వ్యవస్థీకృత బంగారం అక్రమ రవాణా ముఠా తరఫున పనిచేస్తున్నట్లు ఈ ముగ్గురు ప్రయాణికులు అంగీకరించారు. వారిని కస్టమ్స్ చట్టం, 1962 కింద అరెస్టు చేశారు.

డీఆర్ఐ నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో బంగారం అక్రమ రవాణాకు పాల్పడుతున్న కొత్త, అత్యంత అధునాతన పద్ధతి వెలుగులోకి వచ్చింది. సాధారణ తనిఖీల్లో గుర్తించకుండా తప్పించుకునేందుకు బంగారు పొడిని వివిధ రకాల ప్యాక్ చేసిన ఆహార పదార్థాల్లో చాకచక్యంగా కలిపి తరలిస్తున్నట్లు బయటపడింది.

# ఉట్నూర్ గ్రంథాలయంలో సమస్యలు పరిష్కరించాలి

## -పిఓకు వినతి పత్రం ఇచ్చిన బిఆర్ఎస్ నాయకులు



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 26:ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని హైమన్‌డార్ఫ్ గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, విద్యార్థులకు కనీస వసతులు, సౌకర్యాలు కల్పించాలని కోరుతూ బీఆర్ఎస్వీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ ఆధ్వర్యంలో శనివారం ఐటీడీఏ పీవో మంద మకరంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు పీవోను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ధరణి రాజేష్ మాట్లాడుతూ.. ఉట్నూర్ కొమరం భీమ్ ప్రాంగణంలోని హైమన్‌డార్ఫ్ గ్రంథాలయానికి వివిధ ఆదివాసీ గూడేలు, గిరిజన తండాల నుంచి ప్రతిరోజూ 100 మందికి పైగా నిరుద్యోగ యువతీ యువకులు, విద్యార్థులు వచ్చి చదువుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు గ్రంథాలయం ఎంతో ఉపయోగపడుతోందన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు అవసరమైన అనేక సౌకర్యాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచి సమర్థవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రంథాలయంలో కనీస వసతులు కూడా అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.

ప్రస్తుతం గ్రంథాలయంలో రోజువారీ దినపత్రికలు, ఫ్యాన్లు, వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, సరిపడా కుర్చీలు అందుబాటులో లేవని తెలిపారు. అదేవిధంగా విద్యార్థినీ, విద్యార్థులు ఉపయోగించే మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు.

గతంలో గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కూడా ఉండేదని, ప్రస్తుతం ఆ సౌకర్యం లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రంథాలయంలోని సమస్యలను తక్షణమే పరిష్కరించి విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు.

వినతిపత్రంపై ఐటీడీఏ పీవో మంద మకరంద్ సానుకూలంగా స్పందిస్తూ.. గ్రంథాలయంలోని సమస్యలను పరిశీలించి తప్పనిసరిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ధరణి రాజేష్ తెలిపారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

కామారెడ్డి, సెప్టెంబర్ 26: (నేటినిజం ప్రతినిధి): అణిచివేతకు గురైన వర్గాల ఆత్మగౌరవం కోసం నిరంతరంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని జుక్కల్ మండలంలోని ప్రజాప్రతినిధులు, పలువురు వక్తలు కొనియాడారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని ఐలమ్మ చౌక్ వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జుక్కల్ మండల రజకసంఘం అధ్యక్షుడు,జుక్కల్ సర్పంచుల సంఘం అధ్యక్షుడు చాకలి కృష్ణ పలువురు చాకలిఐలమ్మ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. భూస్వాముల, పెత్తందారుల ఆధిపత్యాన్ని ఎదురొడ్డి, భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ ముందు వరుసలో ఉండి తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా పోరాటం చేసిందన్నారు. ఐలమ్మ పోరాట, త్యాగాలను తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచి పోరన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ నాగల్గిద్దె శివానంద్, మాజీ ఏఎంసీ చైర్మన్ కే.సాయగౌడ్, గ్రామ ప్రముఖులు దాదారావు పాటిల్, నిలుపాటిల్, మాజీ సర్పంచ్ లు అస్పత్వర్ వినోద్, బోల్లిగంగాధర్,మనోహర్ పాటిల్,సాయికర్ణ జాదవ్,రవీందర్, పండరితో పాటు రజకసంఘానికి చెందిన చిన్నగంగారం, బాలాజీ, సాయి, మారుతి, నాగనాథ్ మహారాజ్, తుకారం,శ్రవణ్ కుమార్, సాయిలు తదితరులు

# ఎన్ఎల్ఎంసీ మూడు నగరాల్లో నిర్వహించిన పెట్టుబడిదారుల అవగాహన సదస్సులు విజయవంతం

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 26: భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (డీపీఈ) ఆధ్వర్యంలో పనిచేస్తున్న నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ (ఎన్ఎల్ఎమ్‌సీ)... మూడు నగరాల్లో పెట్టుబడిదారుల అవగాహన సదస్సులను విజయవంతంగా నిర్వహించింది. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కార్పొరేట్ సంస్థ రాష్ట్రీయ ఇస్పత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)కి చెందిన 459 భూముల ఈ-వేలానికి ముందు ఈ సదస్సులను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా, ఈ నెల 23న విశాఖపట్నంలో, 24న విజయవాడలో, 25న హైదరాబాద్‌లో పెట్టుబడిదారుల సమావేశాలను నిర్వహించారు. అక్టోబరులో జరగనున్న వేలానికి ముందు... సంభావ్య కొనుగోలుదారులు, పెట్టుబడిదారులు, డెవలపర్లు, ఇతర భాగస్వాములకు భూమి పోర్ట్‌ఫోలియో, ఇ-వేలం ప్రక్రియ గురించి సవివరమైన సమాచారాన్ని అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

విశాఖపట్నంలో జరిగిన పెట్టుబడిదారుల సమావేశంలో 150 మందికి పైగా సంభావ్య కొనుగోలుదారులు, ఇతర భాగస్వాములు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. వీరికి అదనంగా 50 మందికి పైగా వీడియో అనుసంధానం ద్వారా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. వీడియో అనుసంధానం ద్వారా పాల్గొన్న వారిలో ప్రవాస భారతీయులు, విదేశాల్లో నివసిస్తున్న సంభావ్య కొనుగోలుదారులూ ఉన్నారు. ఈ సమావేశంలో... ఆస్తులు, అర్హత, వేలం ప్రక్రియ, లావాదేవీకి సంబంధించిన ఇతర అంశాలపై వారి సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు.

ఆ తరువాత విజయవాడ, హైదరాబాద్‌లలో నిర్వహించిన పెట్టుబడిదారుల సమావేశాలకు... ఆస్తులు, వేలం ప్రక్రియ గురించి సమాచారం కోరుతున్న 50-60 మంది సంభావ్య కొనుగోలుదారులు, వాటాదారులు హాజరయ్యారు.

మూడు నగరాల్లో జరిగిన సమావేశాల్లో భూములు ఉన్న ప్రదేశాలు, వాటి ప్రత్యేకతలు, ప్లాట్ల పరిమాణాలు, వర్తించే నిబంధనలు, షరతుల గురించి నిర్వాహకులు సమగ్రంగా వివరించారు. వీటితో పాటు ఈ-వేలంలో పాల్గొనేందుకు కావలసిన అర్హతలు, రిజిస్ట్రేషన్ చేసుకునే విధానం, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ) వివరాలు, బిడ్డింగ్ ప్రక్రియ, ఈ-వేలానికి సంబంధించిన అన్ని కీలక అంశాలపై కొనుగోలుదారులతో విస్తృతంగా చర్చించారు.

ఈ పెట్టుబడిదారుల సదస్సులలో ఎన్ఎల్ఎమ్‌సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ ప్రదీప్ కుమార్, జనరల్ మేనేజర్ శ్రీ సునీల్ సాహు, ఆర్ఐఎన్ఎల్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) శ్రీ బినయ్ ప్రసాద్‌లు పాల్గొని ప్రసంగించారు. భూములు, వేలం ప్రక్రియ, దానికి సంబంధించిన నిబంధనలపై సంభావ్య కొనుగోలుదారులు, పెట్టుబడిదారులకు గల పలు అనుమానాలను వారు నివృత్తి చేశారు. విశాఖపట్నంలో జరిగిన సమావేశంలో వీడియో అనుసంధానం ద్వారా పాల్గొన్న ప్రవాస భారతీయులు, విదేశాల్లోని కొనుగోలుదారులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు.

ఈ-వేలం ద్వారా విక్రయించనున్న రాష్ట్రీయ ఇస్పత్ నిగమ్ లిమిటెడ్ భూముల పోర్ట్‌ఫోలియోలో మొత్తం 93,572.21 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన 459 ప్లాట్లు ఉన్నాయి. విశాఖపట్నంలోని మద్దిలపాలెం ప్రాంతంలో హెచ్‌బీ కాలనీ, గాజువాక ప్రాంతంలోని ఆటోనగర్ పరిధిలో గల ప్రధాన ప్రాంతాల్లో ఈ స్థలాలు ఉన్నాయి. ఇందులో ఒక్కో ప్లాట్ పరిమాణం సుమారు 128.94 చదరపు గజాల నుంచి 2,728 చదరపు గజాల వరకు ఉన్నాయి.

ఈ భూముల పోర్ట్‌ఫోలియోలో భాగంగా విశాఖపట్నంలోని మద్దిలపాలెం ప్రాంతంలో గల హెచ్‌బీ కాలనీలో సుమారు 87,949.77 చదరపు గజాల విస్తీర్ణంలో గల 456 నివాస ప్లాట్లను విక్రయించనున్నారు. గాజువాకలోని ఆటోనగర్‌లో మొత్తం 5,622.44 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన మూడు ప్లాట్లను వేలానికి ఉంచారు.

హెచ్‌బీ కాలనీ పరిధిలోని ప్లాట్లు విశాఖపట్నంలోని అన్ని వసతులు కలిగిన నివాస ప్రాంతంలో ఉన్నాయి. ఇక్కడ ఇప్పటికే రహదారులు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఆటోనగర్ భూములు వాణిజ్యపరంగా, పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి.

గాజువాక ఆటోనగర్‌లోని బ్లాక్ 2లో 2,728 చదరపు గజాల ఒకే ప్రహరీ గల స్థలంతో పాటు, బ్లాక్ 3లోని మొత్తం 2,894.44 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన రెండు నివాస ప్లాట్లు ఈ పోర్ట్‌ఫోలియోలో భాగంగా ఉన్నాయి.

ఈ-వేలం ప్రక్రియ కోసం ట్రాన్సాక్షన్ కన్సల్టెంట్‌గా క్వికర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (క్యూఐపీఎల్) ను నియమించారు.

ఈ-వేలంను రైల్‌టెల్ ఈ-నివిదా ఈ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా రెండు విడతల్లో నిర్వహిస్తారు. మొదటి రోజైన అక్టోబరు 12న ఉదయం 11:00 గంటల నుంచి సాయంత్రం 7:00 గంటల వరకు 243 ప్లాట్ల కోసం వేలం నిర్వహిస్తారు. మొదటి రోజు కోసం రిజిస్ట్రేషన్, ఈఎండీ సమర్పించడానికి అక్టోబరు 8, సాయంత్రం 5:00 గంటల వరకు గడువు ఉంది.

రెండో రోజైన అక్టోబరు 16న ఉదయం 11:00 గంటల నుండి రాత్రి 7:00 గంటల వరకు ఈ-వేలం నిర్వహిస్తారు. ఇందులో 216 ప్లాట్లను వేలానికి ఉంచగా, ఒక్కో వేలానికి ఈఎండీ రూ. 2 లక్షలుగా నిర్ణయించారు. రిజిస్ట్రేషన్, ఈఎండీ సమర్పణకు అక్టోబర్ 14న, సాయంత్రం 5:00 గంటల వరకు గడువు ఉంది. ఆసక్తి గల బిడ్డర్లు అధికారిక ఈ-వేలం పోర్టల్ ద్వారా వేలం వివరాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ప్లాట్ల సమాచారం, వర్తించే నిబంధనలు, షరతులను తెలుసుకోవచ్చు.

ఎన్ఎల్ఎమ్‌సీ సంస్థ సీఈవో శ్రీ రోహన్ చంద్ ఠాకూర్ మాట్లాడుతూ... "ఆర్ఐఎన్ఎల్ భూముల ఈ-వేలానికి ముందు ఈ మూడు నగరాల్లో పెట్టుబడిదారుల అవగాహన సదస్సు విజయవంతంగా నిర్వహించడం కీలక ముందడుగు. విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ నగరాల్లో నిర్వహించిన ఈ సమావేశాల ద్వారా కొనుగోలుదారులతో వేం నేరుగా మాట్లాడగలిగాం. భూముల వివరాలు, వేలం ప్రక్రియ, నిబంధనల గురించి వారికి పూర్తి అవగాహన కల్పించాం. ఈ మూడు నగరాల సదస్సులకు పెట్టుబడిదారులతో పాటు వీడియో అనుసంధానం ద్వారా విదేశాల్లోని ప్రవాస భారతీయులూ హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్ఈల) ఆధీనంలో ఉన్న భూములను అత్యంత పారదర్శకంగా, నిర్మాణాత్మక విధానంలో వేలం వేయడానికి ఎన్ఎల్ఎమ్‌సీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది" అని పేర్కొన్నారు.

మూడు నగరాల్లో పెట్టుబడిదారుల అవగాహన సదస్సు ముగిసిన నేపథ్యంలో... కొనుగోలుదారులకు సహాయం చేయడం కోసం వేలం ముగిసే దాకా ప్రాజెక్ట్ సైట్ వద్ద ట్రాన్సాక్షన్ కన్సల్టెంట్ అయిన క్యూఐపీఎల్, ఆర్ఐఎన్ఎల్ బృందం ప్రతిరోజూ అందుబాటులో ఉంటారు. స్థలాల వివరాలు, ఈ-వేలం ప్రక్రియకు సంబంధించి కొనుగోలుదారులకు వచ్చే ఎలాంటి సందేహాలనైనా వారు అక్కడికక్కడే నివృత్తి చేస్తారు.

ఈ బృందాలు ఆసక్తి గల కొనుగోలుదారులకు ప్రాజెక్టుకు సంబంధించి అవసరమైన సమాచారాన్ని అందిస్తాయి.

# ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య భరోసా కార్యక్రమంగా ఏబీ పీఎం-జేఏవై..

## 60 కోట్లకు పైగా లబ్ధిదారులకు భరోసా: కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26: కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ జేపీ నడ్డా నేడు న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆరోగ్య మంథన్ 2026ను ప్రారంభించారు. ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ పీఎం-జేఏవై) ఎనిమిదేళ్లు పూర్తి చేసుకోవడం, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) అయిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ ప్రభుత్వ అధికారులు, ఆరోగ్య సేవల ప్రదాతలు, బీమా సంస్థల ప్రతినిధులు, సాంకేతిక, డిజిటల్ ఆరోగ్య నిపుణులు, విద్యావేత్తలు, అభివృద్ధి భాగస్వాములు, ఇతర భాగస్వామ్య వర్గాలు హాజరయ్యారు. భారత్ ఆరోగ్య భరోసా, డిజిటల్ ఆరోగ్య వ్యవస్థలో సాధించిన పురోగతి, తదుపరి దశలో చేపట్టాల్సిన ప్రాధాన్యతలపై ఈ కార్యక్రమంలో చర్చించారు.

సమావేశాన్ని ఉద్దేశించి కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ జేపీ నడ్డా మాట్లాడుతూ.. ఏబీ పీఎం జేఏవై ఎనిమిదేళ్లు, ఏబీడీఎం అయిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భాగస్వామ్య వర్గాలందరికీ అభినందనలు తెలిపారు. మైలురాళ్లుగా నిలిచే ఈ కార్యక్రమాలు ఇప్పటివరకు సాధించిన పురోగతిని సమీక్షించుకోవడంతో పాటు, పేదలు, సమాజంలోని అణగారిన వర్గాల సంక్షేమం పట్ల మన నిబద్ధతను పునరుద్ధరించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాయని అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ “సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్” దార్శనికతకు అనుగుణంగా ఈ కృషిని కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు.

ఏబీ పీఎం జేఏవై ప్రారంభమైనప్పటి నుంచి గణనీయంగా విస్తరించిందని శ్రీ నడ్డా పేర్కొన్నారు. 60 కోట్లకు పైగా లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరిందని, 13 కోట్లకు పైగా ఆసుపత్రి చేరికలకు వీలు కల్పించి, రూ.2 లక్షల కోట్లకు పైగా విలువైన చికిత్సను అందించిన ఏబీ పీఎం జేఏవై ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య భరోసా కార్యక్రమంగా అవతరించిందని తెలిపారు.

సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా 70 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వృద్ధులందరికీ ఈ పథకాన్ని ప్రభుత్వం మరింత విస్తరించి, వారిని కూడా పథకం పరిధిలోకి తీసుకువచ్చిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా వలస కార్మికులకు పథకం కింద సేవలను ఎక్కడైనా పొందే సౌలభ్యం ముఖ్యమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో రాష్ట్ర ప్రభుత్వాలు, ఆరోగ్య సేవల సంస్థలు, ఇతర భాగస్వామ్య వర్గాలు అందిస్తున్న సహకారాన్ని ఆయన అభినందించారు.

ఏబీ పీఎం-జేఏవై, ఏబీడీఎం ప్రయాణం ఆరోగ్య రంగంలో సాంకేతికత పోషిస్తున్న పరివర్తనాత్మక పాత్రను స్పష్టంగా చూపించిందని కేంద్ర మంత్రి తెలిపారు. వివిధ ప్రాంతాల్లో డిజిటల్ వ్యవస్థలు ధ్రువీకరణ, అనుమతులు, చికిత్సకు అందుబాటును సులభతరం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఏబీడీఎం కింద సాధించిన పురోగతిని ప్రస్తావిస్తూ.. ఇప్పటివరకు 97.8 కోట్లకు పైగా అబా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్-ఏబీహెచ్ఏ) కార్డులు అందించారని, 121 కోట్లకు పైగా ఆరోగ్య రికార్డులు అనుసంధానమయ్యాయని తెలిపారు. ఏబీడీఎం వ్యవస్థలో 5.6 లక్షలకు పైగా ఆరోగ్య సదుపాయాలు, సుమారు 11 లక్షల మంది ఆరోగ్య సేవల నిపుణులు నమోదు చేసుకున్నారని వివరించారు. ఆసుపత్రులు, బీమా సంస్థలను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడమే లక్ష్యంగా అభివృద్ధి చేస్తున్న జాతీయ వైద్య క్లెయిమ్స్ ఎక్స్చేంజ్‌ను కూడా ఆయన ప్రస్తావించారు.

ఆరోగ్య మంథన్ 2026లో ప్రారంభించిన కార్యక్రమాలను గురించి శ్రీ జేపీ నడ్డా మాట్లాడుతూ.. ఇవి డిజిటల్ ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు, ఆరోగ్య డేటాను సురక్షితంగా వినియోగించేందుకు, ఆరోగ్య పరిశోధన, ఆవిష్కరణలు, డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడంలో కొత్త అవకాశాలను సృష్టించేందుకు దోహదపడతాయని అన్నారు. జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏ) కృషిని ఆయన అభినందించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు, ఆరోగ్య నిపుణులు, ఎంపానెల్ చేసిన ఆసుపత్రులు, ఆయుష్మాన్ మిత్రలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సాంకేతిక భాగస్వాములు, ఇతర భాగస్వాముల పాత్రను ఆయన గుర్తించారు.

ఈ ప్రయాణం నిరంతరం కొనసాగాలని శ్రీ జేపీ నడ్డా పేర్కొన్నారు. ఆరోగ్య సేవలను మరింత అందుబాటులోకి, సమర్థవంతంగా, రోగి కేంద్రీకృతంగా మార్చేందుకు డిజిటల్ సాంకేతికతను వినియోగించడంపై నిరంతరంగా దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య మంథన్ 2026లో జరిగే చర్చలు కార్యాచరణకు దారితీసే ఫలితాలను అందిస్తాయని, భారత్ ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు మానవాళికి సేవ చేయడంలో మరింతగా దోహదపడతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య సంస్థను నీతి ఆయోగ్ సభ్యుడు (వైద్య) డాక్టర్ ఎం శ్రీనివాస్ అభినందించారు. ఏబీ పీఎం-జేఏవై తీసుకువచ్చిన మార్పును ప్రస్తావిస్తూ.. ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన ప్రజలు మరింత విశ్వాసంతో, తక్కువ ఆర్థిక భారంతో ఆరోగ్య సేవలను పొందేందుకు ఈ పథకం వీలు కల్పించిందని అన్నారు. తదుపరి దశలో రోగుల చికిత్సలో నిరంతరత, నాణ్యత, రోగి కేంద్రీకృత ఆరోగ్య సేవలను బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని ఆయన చెప్పారు. ముఖ్యంగా ప్రత్యేక వైద్య చికిత్స అవసరమైన రోగులకు అంతరాయం లేకుండా రిఫరల్ సేవలు అందించే వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ..అబాను మరింత విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావడం, ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, పౌరుల సమ్మతి, తగిన భద్రతా చర్యలతో డిజిటల్ ఆరోగ్య రికార్డుల పరస్పర అనుసంధాన సామర్థ్యాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. అధిక నాణ్యత, ప్రామాణీకరణ, పరస్పర అనుసంధాన సామర్థ్యం కలిగిన ఆరోగ్య డేటా ఆరోగ్య పరిశోధనను ముందుకు తీసుకెళ్లడానికి, ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధను బాధ్యతాయుతంగా వినియోగించడం కీలకమని ఆయన పేర్కొన్నారు. జాతీయ ఆరోగ్య క్లెయిమ్‌ల మార్పిడి వేదికను బలోపేతం చేయడంతో పాటు, క్లెయిమ్‌లు, ముందస్తు అనుమతి ప్రక్రియలను మరింత సులభతరం చేయాలని, ఆరోగ్య భరోసా, డిజిటల్ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహనను విస్తృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయుష్మాన్ భారత్ పీఎం జేఏవై విజయాన్ని ఐఆర్‌డీఏఐ చైర్మన్ శ్రీ అజయ్ సేథ్ ప్రస్తావించారు. ఈ పథకం ద్వారా పొందిన అనుభవం దేశ ఆరోగ్య బీమా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు అవకాశాన్ని కల్పిస్తోందని అన్నారు. పౌరులు, ఆసుపత్రులు, బీమా సంస్థలు, సాంకేతిక సేవల ప్రదాతలు సహా అన్ని భాగస్వామ్య వర్గాలకు విలువ చేకూర్చేలా, ఆరోగ్య సేవల్లో నాణ్యత, అందుబాటు ధర, ప్రాప్యతను నిర్ధారించాల్సిన అవసరాన్ని ఆయన చెప్పారు.

ఆరోగ్య బీమాలో ప్రామాణీకరణ, పారదర్శకత ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ.. ఆరోగ్య బీమాకు గుర్తింపుగా అబాను వినియోగించడం, చికిత్సల కోడీకరణ, ప్రామాణిక బిల్లింగ్ విధానాలు, ప్రామాణిక చికిత్సా విధానాలు, మార్గదర్శకాలు వంటి కీలక డిజిటల్, కార్యాచరణ వ్యవస్థలను మరింత విస్తృతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని శ్రీ సేథ్ పేర్కొన్నారు. మరింత మెరుగైన పరస్పర అనుసంధాన సామర్థ్యాన్ని సాధించడంలో, అనుసంధానిత ఆరోగ్య బీమా వ్యవస్థను అభివృద్ధి చేయడంలో భారతదేశ డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, జాతీయ ఆరోగ్య క్లెయిమ్‌ల మార్పిడి వేదిక ఎన్‌హెచ్‌సీఎక్స్) కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన వివరించారు. “సాధ్యమైనంత విస్తృత ప్రజానీకానికి అందుబాటు ధరలో, నాణ్యమైన, సమర్థవంతమైన ఆరోగ్య సేవలను అందించడం మన పరిధిలోనే ఉంది” అని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్, డీహెచ్‌ఆర్ కార్యదర్శి డాక్టర్ రాజీవ్ బహల్ మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ పీఎం-జేఏవై ఎనిమిదేళ్లు పూర్తి చేసుకోవడం, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) అయిదేళ్లు పూర్తి చేసుకోవడం ప్రాధాన్యతను వివరించారు. ఆయుష్మాన్ భారత్ పీఎం-జేఏవై ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య భరోసా పథకంగా అవతరించిందని, 60 కోట్లకు పైగా పౌరులకు ప్రయోజనం చేకూరుస్తోందని తెలిపారు. ఇకపై ఆరోగ్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం, పౌరులకు మరింత ప్రయోజనం చేకూరేలా పరిధిని విస్తరించడంపై దృష్టి సారించనున్నట్లు ఆయన చెప్పారు.

హెచ్‌ఆర్, ఐసీఎంఆర్, ఎన్‌హెచ్‌ఏల మధ్య సహకారాన్ని ప్రస్తావిస్తూ.. రెండు కీలక రంగాల్లో జరుగుతున్న పనిని డాక్టర్ రాజీవ్ బహల్ వివరించారు. చికిత్సా విధానాల ప్రామాణీకరణపై మాట్లాడుతూ...ప్రామాణీకరించిన అల్గారిథమ్‌ల ఆధారంగా చికిత్స అందించడం ద్వారా ఆరోగ్య సేవల్లో మరింత స్థిరత్వం, నాణ్యతను నిర్ధారించవచ్చని తెలిపారు. ఐసీఎంఆర్ ఇప్పటికే 150కి పైగా ప్రామాణిక చికిత్సా విధానాలు, మార్గదర్శకాలను అభివృద్ధి చేసిందని పేర్కొన్నారు. ఆరోగ్య సేవల్లో వ్యయ-సామర్థ్యం ప్రాముఖ్యతను కూడా ఆయన వివరించారు. డీహెచ్‌ఆర్ ఆధ్వర్యంలోని భారత్‌లో ఆరోగ్య సాంకేతికతల మూల్యాంకన కార్యక్రమం (హెచ్‌టీఏఐఎన్) ఆరోగ్య సాంకేతికతలు, జోక్యాల వ్యయ-సామర్థ్యాన్ని మూల్యాంకనం చేస్తుందని తెలిపారు.

ఆయుష్మాన్ భారత్ పీఎం-జేఏవై ఎనిమిదేళ్లు, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అయిదేళ్లు పూర్తి చేసుకొని రెండు కీలక మైలురాళ్లను సాధించినందుకు అన్ని భాగస్వామ్య వర్గాలకు ఎన్‌హెచ్‌ఏ సీఈఓ శ్రీ సునీల్ కుమార్ బర్న్‌వాల్ అభినందనలు తెలిపారు. ఈ రెండు కార్యక్రమాల విస్తృతి, చేరువను ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా 49 కోట్లకు పైగా ఆయుష్మాన్ కార్డులు, సుమారు 98 కోట్లకు అబా ఐడీలు జారీ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణను ప్రస్తావిస్తూ.. ఆయుష్మాన్ భారత్ పీఎం-జేఏవై ఇప్పటివరకు 13 కోట్లకు పైగా రోగుల ఆరోగ్య రికార్డులను సృష్టించిందని, ఇది పరిశోధన, అభివృద్ధి, ఆరోగ్య విశ్లేషణలకు విలువైన సమాచార నిధిగా ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. రోగుల గుర్తింపును భద్రపరుస్తూనే, ఇటువంటి డేటాను బాధ్య తాయుతంగా వినియోగించేందుకు సురక్షిత డేటా వాతావరణం దోహదపడుతుందని చెప్పారు. అలాగే స్వయంచాలక క్లెయిమ్‌ల పరిష్కార విధానాన్ని ప్రారంభించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. సాంకేతికత, డేటా ఆధారిత ప్రక్రియల ద్వారా ఏబీ పీఎం జేఏవై కింద క్లెయిమ్‌ల పరిశీలన, పరిష్కార ప్రక్రియను మరింత సరళీకరించి, బలోపేతం చేయడం ఈ విధానం లక్ష్యమని తెలిపారు.

భారత్ ఆరోగ్య భరోసా వ్యవస్థకు డిజిటల్ పునాదులను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా చేపట్టిన పలు కార్యక్రమాలను ప్రారంభించడం ఆరోగ్య మంథన్ 2026లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వీటిలో జాతీయ ఆరోగ్య సేవల ప్రదాతల నమోదు జాబితా (ఎన్‌హెచ్‌పీఆర్) మొబైల్ యాప్, చెల్లింపుదారుల కోసం ఎన్‌హెచ్‌సీఎక్స్ అమలు మార్గదర్శిని, మోడల్ డిజిటల్ వైద్య సదుపాయం కోసం మార్గదర్శక పుస్తకం, సురక్షిత డేటా వాతావరణం అప్లికేషన్, ఏబీ పీఎం జేఏవై కింద స్వయంచాలక క్లెయిమ్‌ల పరిష్కార విధానం ఉన్నాయి.

బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) సహకారంతో జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏ) అభివృద్ధి చేసిన సురక్షిత డేటా వాతావరణం, ఏబీ పీఎం జేఏవై, ఏబీడీఎంకు సంబంధించిన ఆరోగ్య డేటాను యాక్సెస్ చేయడానికి, విశ్లేషించేందుకు నియంత్రిత వాతావరణంగా రూపొందించారు. అనుమతి పొందిన సంస్థలు వ్యక్తిగత గుర్తింపును తొలగించిన డేటాతో పని చేయడం లేదా ఎన్‌హెచ్‌ఏకు చెందిన ప్రత్యేకంగా వేరుచేసిన వాతావరణంలో కోడ్‌ను అమలు చేయడం వీలవుతుంది. విడుదలకు ముందు రూపొందించిన ఫలితాలను సమీక్షించే విధానం కూడా ఇందులో ఉంటుంది. వ్యక్తిగత డేటా రక్షణకు అవసరమైన భద్రతా చర్యలను కలిగి ఉండే ఈ కార్యక్రమం ఆరోగ్య పరిశోధన, కార్యక్రమాల ప్రణాళిక, ఫలితాల విశ్లేషణ, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధ ఆవిష్కరణలకు దోహదపడేలా రూపొందించారు.

ఆరోగ్య మంథన్ 2026లో జరిగిన చర్చలు ఆరోగ్య సేవల సామర్థ్యం, నాణ్యత, వివిధ డిజిటల్ వ్యవస్థల మధ్య పరస్పర అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించాయి. “ఆరోగ్య బీమా ప్రక్రియలను సరళీకరించేందుకు ఎన్‌హెచ్‌సీఎక్స్” అంశంపై జరిగిన సమావేశంలో ఆరోగ్య బీమా ప్రక్రియలను సరళంగా, ప్రామాణికంగా, సాంకేతికత ఆధారంగా నిర్వహించడంలో జాతీయ ఆరోగ్య క్లెయిమ్‌ల మార్పిడి వేదిక పోషించే పాత్రను పరిశీలించారు. పరస్పర అనుసంధాన సామర్థ్యం కలిగిన డిజిటల్ క్లెయిమ్‌ల మౌలిక వసతులు సామర్థ్యాన్ని ఎలా మెరుగుపరుస్తాయి, ఆరోగ్య బీమా వ్యవస్థలోని వివిధ భాగస్వామ్య వర్గాల మధ్య సమన్వయాన్ని ఎలా బలోపేతం చేస్తాయి, ఆరోగ్య రంగానికి అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణలో కొత్త అవకాశాలను ఎలా కల్పిస్తాయనే అంశాలపై చర్చించారు.

అనంతరం ఏబీ పీఎం జేఏవై, ఏబీడీఎం విభాగాల కింద సమాంతర సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఆయా కార్యక్రమాల అమలు, ఆరోగ్య సేవల అందజేత, డిజిటల్ పరివర్తనకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను పరిశీలించారు.

ఏబీ పీఎం జేఏవై విభాగంలో “క్లెయిమ్‌ల ప్రాసెసింగ్ నుంచి ఇంటెలిజెంట్ అస్యూరెన్స్ వరకు: ఏబీ పీఎం జేఏవైలో పరివర్తన” అంశంపై సమావేశం జరిగింది. ఇందులో క్లెయిమ్‌ల ప్రాసెసింగ్‌ను, కార్యక్రమం సమగ్రతను మరింత బలోపేతం చేసేందుకు సాంకేతికత, డేటా, డేటా విశ్లేషణలను ఎలా ఉపయోగించాలనే అంశాలను పరిశీలించారు.

## భుజ్, బరౌనీ మధ్య వారానికి మూడుసార్లు నడిచే కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించనున్న భారతీయ రైల్వే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26గుజరాత్‌లోని భుజ్, బీహార్‌లోని బరౌనీ మధ్య వారానికి మూడు సార్లు నడిచే కొత్త సర్వీసును ప్రారంభించడానికి భారతీయ రైల్వే ఆమోదం తెలిపింది. ఈ కొత్త సర్వీసు గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో 2,532 కి.మీ. మేర ముఖ్యమైన ప్రాంతాలను కలుపుతుంది.

రైలు నెం.19427 భుజ్-బరౌనీ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ భుజ్ వద్ద 17:30 గంటలకు బయలుదేరి 04:05 గంటలకు బరౌనీకి చేరుకుంటుంది. అదే విధంగా రైలు నెం.19428 బరౌనీ- భుజ్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ బరౌనీలో 23:55కు బయలుదేరి భుజ్‌కు 13:15 గంటలకు చేరుకుంటుంది.

సోమ, బుధ, శనివారాల్లో భుజ్-బరౌనీ సర్వీసు నడుస్తుంది. మంగళ, గురు, శనివారాల్లో బరౌనీ-భుజ్ సర్వీసు నడుస్తుంది.

ఈ కొత్త రైలు సర్వీసుకు మార్గమధ్యంలో పలు కీలక స్టేషన్లలో వాణిజ్య స్టాపులు ఉన్నాయి. వీటిలో సమాఖియాలీ, అహ్మదాబాద్, రత్లాం, కోటా, సవాయ్ మాధోపూర్, గంగాపూర్ సిటీ, భరత్‌పూర్, మథుర, హత్రాస్, బరేలీ, ఇజ్జత్‌నగర్, పిలిభిత్, లఖింపూర్, గోండా, గోరఖ్‌పూర్, సివాన్, ఛప్రా, హాజీపూర్, ముజఫర్‌పూర్, సమస్తిపూర్ తదితర ముఖ్యమైన స్టేషన్లు ఉన్నాయి.

దేశంలోని పశ్చిమ, తూర్పు ప్రాంతాల మధ్య అదనపు రైలు ప్రయాణ మార్గాన్ని ఈ కొత్త రైలు సర్వీసు కల్పిస్తుంది. అలాగే గుజరాత్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, బీహార్ మధ్య ప్రయాణించే ప్రయాణికులకు రవాణా సదుపాయాన్ని మెరుగుపరుస్తుంది.

## పెడన పట్టణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన.

అమరావతి, సెప్టెంబర్ 26: పెడన పట్టణ అభివృద్ధికి మరింత ప్రాధాన్యతనిస్తూ, పెడన పురపాలక సంఘం పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.

పెడన పురపాలక సంఘానికి మంజూరైన హైబ్రిడ్ యాన్యూటీ మోడల్ నిధులు రూ.12.00 కోట్లు, అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.91.00 లక్షలు నుంచి చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో భాగంగా, ఈరోజు రూ.5.00 కోట్ల విలువైన ఊంఓ పనులకు, రూ.15.00 లక్షల విలువైన 15వ ఆర్థిక సంఘం పనులకు పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ శంకుస్థాపన చేశారు.

పెడన పట్టణంలోని 18, 19, 20, 21, 22, 23వ వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా వివిధ అభివృద్ధి పనులు బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, కల్వర్టులు, అంతర్గత రహదారుల నిర్మాణం తదితర పనులు ఉన్నాయి. ఆయా వార్డుల్లో రహదారుల అభివృద్ధి, రాకపోకలకు సౌకర్యం మెరుగుపరచడం, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం లక్ష్యంగా పనులు చేపట్టనున్నారు.

పెడన పట్టణంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతూ, పట్టణ మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, వార్డు ఇన్‌చార్జిలు, ప్రజలు పాల్గొన్నారు

# అన్నప్రసాద పవిత్రత కాపాడాలి..

## -భక్తులకు మెరుగైన సేవలందించాలి



అమరావతి, సెప్టెంబర్ 26: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలోని అన్నదాన విభాగంలో అన్నప్రసాద పవిత్రతను కాపాడుతూ భక్తులకు మెరుగైన సేవలందించాలని దేవదాయ శాఖ కమిషనర్ కే. రామచంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం అన్నదాన విభాగాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అన్నప్రసాదం తయారీ, పంపిణీ విధానం, శుచి?శుభ్రత, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అన్నప్రసాదం నాణ్యతలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు.

అన్నదానానికి వచ్చే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని, రద్దీ సమయంలోనూ ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అన్నదాన విభాగంలో పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యమివ్వాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. భక్తుల సంతృప్తే ప్రధాన లక్ష్యంగా సేవలను మరింత మెరుగుపరచాలని కమిషనర్ కే రామచంద్ర మోహన్ సూచించారు. ఈ పర్యటనలో ఈఓ శీనా నాయక్, ఏఈఓ లు ఇతర దేవస్థానం సిబ్బంది ఉన్నారు.

# పూర్తి పునర్వినియోగ ‘అగ్నిబాన్’ ప్రయోగ వాహనం కోసం ‘ఆర్డీఐ’ కింద -200 కోట్ల మద్దతిస్తూ ‘అగ్నికుల్ కాస్మోస్’తో ‘టీడీబీ-డీఎస్టీ’ ఒప్పందం

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 26: స్వదేశీ, పునర్వినియోగ అంతరిక్ష రవాణా వ్యవస్థల నవతరం ఆవిష్కరణ దిశగా భారత్ ప్రస్థానానికి గణనీయ ఉత్తేజం లభించింది. ఈ మేరకు కేంద్ర శాస్త్ర-సాంకేతిక మంత్రిత్వశాఖ (డీఎస్‌టీ) పరిధిలోని సాంకేతికాభివృద్ధి సంస్థ (టీడీబీ) తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైలోని ‘మెస్సర్స్ అగ్నికుల్ కాస్మోస్ ప్రైవేట్ లిమిటెడ్’తో ఒప్పందం కుదుర్చుకుంది. దీనికింద పరిశోధన-అభివృద్ధి-ఆవిష్కరణ (ఆర్‌డీఐ) నిధి నుంచి ?200 కోట్ల ఆర్థిక సహాయం అందజేస్తుంది.

సాంకేతికత సంసిద్ధత స్థాయి-4 (టీఆర్ఎల్) నుంచి టీఆర్ఎల్-8 దాకా శాస్త్ర పరిజ్ఞానాన్ని ఉన్నతీకరిస్తూ భావితరం పునర్వినియోగ ప్రయోగ వాహనం (ఆర్ఎల్వీ) ‘అగ్నిబాన్’ తయారీపై దృష్టి కేంద్రీకరించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఇందుకోసం అందజేసే ఆర్థిక సహాయం ఐచ్ఛికంగా మార్చుకోగల డిబెంచర్ల (ఓసీడీ) ద్వారా ఆ సంస్థకు లభిస్తుంది. ఈ మేరకు ప్రయోగ వాహన తొలి దశను మాత్రమే తిరిగి వాడుకోగలిగే ప్రస్తుత సంప్రదాయ పరిజ్ఞానాన్ని అధిగమిస్తూ- వాహన అన్ని దశల పునర్వినియోగ సామర్థ్యం సాధించడం ఈ ప్రాజెక్టు ధ్యేయం. ప్రతిపాదిత రూపకల్పన, ప్రయోగ, తయారీ వ్యయం తగ్గింపు సహా అంతరిక్ష శిథిలాల సమస్యను పరిమితం చేస్తూ, అధిక పౌనఃపున్యంతో, పునరావృత ప్రయోగ సాధ్యంగా ‘అగ్నిబాన్’ రూపుదాలుస్తుంది.

ఇందులో పునర్వినియోగ ప్రయోగ వాహణ నిర్మాణం ప్రధానాంశం. ఈ మేరకు తేలికైన ఎగువ దశ, కచ్చితమైన కక్ష్య ప్రవేశ సామర్థ్యం, డీప్ థ్రాట్లింగ్, పునఃప్రారంభ సామర్థ్యం దిశగా రూపొందించిన సెమీ- క్రయోజెనిక్ ద్రవ ఇంధన చోదక వ్యవస్థ ఇందులో అంతర్భగంగా ఉంటాయి. ఈ వ్యవస్థలతో పలు మార్లు ప్రయోగించగలిగేలా వాహనాన్ని మెరుగుపరుస్తూ మిషన్ కార్యకలాపాలలో మరింత సౌలభ్యాన్నివ్వడం దీని ఉద్దేశం.


వివిధ అభివృద్ధి- ప్రయోగాత్మక పరీక్ష కార్యక్రమాల ద్వారా ఈ సాంకేతికతలోని అనేక అంశాల్లో అగ్నికుల్ తన సామర్థ్యాన్ని ఇప్పటికే ప్రదర్శించింది. ఈ సంస్థ సాధించిన మునుపటి విజయాల్లో స్వదేశీ ఆర్బిటల్-క్లాస్ ప్రయోగ వాహనం ‘అగ్నిబాన్’ తయారీ ప్రధానమైనది. ఈ మేరకు తమ సంస్థలోనే ప్రణాళిక రూపొందించి, ఏకఖండ 3డీ-ప్రింటెడ్ ‘అగ్నిలెట్’ రాకెట్ ఇంజిన్‌ను తయారు చేసింది. చిన్న ఉపగ్రహ ప్రయోగాల కోసం మాడ్యులర్ కాన్ఫిగరింగ్ చేయగల ప్రయోగ వాహన అభివృద్ధి-వాణిజ్యీకరణ కోసం టీడీబీ ఇంతకుముందు కూడా ‘అగ్నికుల్’ సంస్థకు మద్దతిచ్చింది.

ఈ నేపథ్యంలో ‘ఆర్‌డీఐ’ పథకం మద్దతుతో కూడిన ప్రస్తుత కొత్త కార్యక్రమం, సంబంధిత సాంకేతిక ప్రస్థానాన్ని మరొక దశ ముందుకు తీసుకెళ్తుంది. అంటే- కేవలం ప్రయోగ వాహన తయారీ నుంచి పునర్వినియోగ, పునరావృత, కార్యాచరణ సామర్థ్యాల ఉన్నతీకరణతో అత్యాధునిక వ్యవస్థను అభివృద్ధి చేసే దిశగా ఇది సాగుతుంది. ప్రతిపాదిత ‘అగ్నిబాన్ ఆర్ఎల్వీ’లో పునర్వినియోగ హిత ఎగువ దశ స్వరూపం, దిగువకు చేరగల ప్రొపల్షన్ వ్యవస్థ ఉన్నాయి. తదనుగుణంగా నియంత్రిత అవరోహణ, పునరుద్ధరణకు మద్దతివ్వగల సాంకేతికతలను సంస్థ రూపొందిస్తోంది. ఈ కార్యక్రమంలో, పునఃప్రారంభం, డీప్ థ్రాట్లింగ్ సమర్థ ప్రొపల్షన్ వ్యవస్థలు కూడా ఉన్నాయి. అవరోహణ, లాండింగ్ కార్యకలాపాల్లో కీలక సామర్థ్యాలివే!

పునర్వినియోగ ప్రయోగ వాహన తయారీకి అవసరమైన చోదక శక్తి, ఆరోహణ వ్యవస్థలు, కక్ష్యలోకి ప్రవేశం, అవరోహణ-పునరుద్ధరణ వంటి సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి-ధ్రువీకరణకు ఈ ప్రాజెక్టు తోడ్పడుతుందని అంచనా. అంతరిక్ష సాంకేతికతలలో అత్యాధునిక-పునర్వినియోగ ప్రయోగ వాహనాలు, ప్రొపల్షన్ ఆవిష్కరణల వంటి వాటిని ఆర్‌డీఐ నిధి ప్రాధాన్యాంశాలుగా గుర్తించిన నేపథ్యంలో తదనుగుణంగానే ఈ కార్యక్రమం సాగుతుంది.


ఈ సందర్భంగా టీడీబీ కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ పాఠక్ మాట్లాడుతూ- “భారత అంతరిక్ష రంగ ప్రస్థానంలో తదుపరి దశ లేదా కక్ష్యను చేరడమే కాకుండా ఆ ప్రక్రియను మరింత తరచుగా, సౌలభ్యంతో, సమర్థంగా విజయవంతం చేయగల సాంకేతికతలు ఇప్పుడు అవసరం. దీనికి సంబంధించి పునర్వినియోగ వాహన రూపకల్పన ఓ కీలక పరిజ్ఞానం. ఆ దిశగానే ప్రతిష్టాత్మక స్వదేశీ సాంకేతికతల అభివృద్ధికి ఆర్డీఐ ఫండ్ ద్వారా టీడీబీ మద్దతిస్తోంది. అత్యాధునిక సాంకేతిక దశల నుంచి వినియోగం వైపు పురోగమనం కోసం నిరంతర పెట్టుబడులు అవసరం. ఈ పరిస్థితుల నడుమ పునర్వినియోగ ప్రయోగ వాహన తయారీపై ‘అగ్నిబాన్ ఆర్ఎల్వీ’ కార్యక్రమం దృష్టి సారిస్తుంది. అంటే- ఆధునిక అంతరిక్ష యాన వ్యవస్థలలో భారత్ సామర్థ్య బలోపేతం ద్వారా ఈ విధానాన్ని ప్రతిబింబిస్తుంది” అన్నారు.

అనంతరం ‘అగ్నికుల్ కాస్మోస్ ప్రైవేట్ లిమిటెడ్’ వ్యవస్థాపకులు మాట్లాడుతూ- “ప్రయోగ వాహన పునర్వినియోగం కోసం ప్రొపల్షన్, వాహన రూపకల్పన, గైడెన్స్, రికవరీ, మిషన్ ఆపరేషన్లను అత్యంత విశ్వసనీయ ఏకీకృత వ్యవస్థగా రూపొందించడం అవశ్యం. ఈ కృషికి టీడీబీ విశిష్ట మద్దతు లభించడం మాకెంతో ప్రత్యేకం.

# తెలంగాణ ఉద్యమ ఆది గురువు కొండా లక్ష్మణ్

సెప్టెంబర్ 27.. బాపూజీ జయంతి



భారత స్వాతంత్ర్య పోరాటంలో , ముల్కీ ఉద్యమంలో , నిరంకుశ నిజాం వ్యతిరేక పోరాటంలో , తెలంగాణ 1969 నాటి తొలి, ఇటీవలి మలి దశ ఉద్యమాలలో కీలక పాత్రలు వహించిన, జీవితాంతం తెలంగాణ సమస్యలపై పోరాటం చేసిన తెలంగాణ పక్షపాతి దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ. ఏక కాలంలో నాలుగు భిన్నమైన, అంతర్గత సంబంధం కలిగి ఉన్న ప్రజాఉద్యమాలతో ఆయన జీవితం ముడివడి ఉన్నదని చెప్పడం సముచితం. అవి వరుసగా నిజాం వ్యతిరేక పోరాటం, వెనుకబడిన కులాల ఉద్యమం, చేనేత సహకారోద్యమం, ప్రత్యేక తెలంగాణోద్యమం. వాస్తవానికి తెలంగాణ ఉద్యమానికి ఆయన ఆది గురువు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర వితం ముడివడి ఉన్నదని చెప్పడం సముచితం. 1969లో తొలి దశ పోరాటంలోనే కీలక పాత్ర పోషించి, మంత్రి పదవిని కూడా తృణ ప్రాయంగా త్యజించిన త్యాగశీలి. తెలంగాణ వాసుల కష్టాలు తీరాలంటే, ప్రత్యేక రాష్ట్ర సాధన తప్ప వేరే మార్గం లేదని భావించి, అందుకు వివిధ మార్గాలలో నిరసన స్వరాలు వినిపించాడు. అలనాటి నిజాం సంస్థానంలో ఆదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబర్ 27న కొండా లక్ష్మణ్ జన్మించాడు. చిన్నతనాన తల్లిని కోల్పోగా, ప్రాథమిక విద్య ఆసిఫాబాద్ లో, హైదరాబాద్ లో న్యాయ శాస్త్ర విద్య పూర్తి చేసి, 1948లో న్యాయ వాద వృత్తి చేపట్టాడు. ఆనాడు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించిన వారి పక్షాన కేసులను వాదించి, గెలిపించే వాడు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన , దేశంలోని అంతర్భాగమైన నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ, నిజాం నిత్య అకృత్యాలకు లోనైన దుస్థితిలో తెలంగాణ విమోచనోద్యమంలో క్రియా శీలక పాత్ర పోషించాడు. 1947 డిసెంబర్ 4న నిజాం ప్రభువు పై బాంబులు విసిరిన నారాయణరావు పవార్ బృందంలో కొండా లక్ష్మణ్ కూడా నిందితుడే. కొంతకాలం అజ్ఞాతుడుగా ఉన్నాడు. నిజాం నిరంకుశ పాలన పై నిప్పుల వర్షం కురిపిస్తూ, ఆయన పాలన అంతానికి,

తిరుగుబాటు బావుటా ఎగురవేసి, తొలుదొలుత వ్యూహ రచన చేసింది బాపూజీయే. 1952 లో తొలిసారి ఆసిఫాబాద్ శాసనసభ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి, శాసనసభలో అడుగు పెట్టాడు. 1957లో చిన్న కొండూరు నుండి గెలుపొంది శాసనసన డిప్యూటీ స్పీకర్ గా బాధ్యతలు స్వీకరించాడు. 1962లో స్వల్ప తేడాతో ఓటమి పాలైనా, ప్రత్యర్థి ఆక్రమాలతో గెలిచారని కేసు పెట్టి, విజయం సాధించాడు. 1967లో భువనగిరి నుండి గెలిచాడు. 1957-60 వరకు ఉమ్మడి రాష్ట్రం డిప్యూటీ స్పీకర్గా, అనంతరం దామోదరం సంజీవయ్య క్యాబినేట్లో ఎక్సైజ్, చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా, బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కార్మిక, సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత సీఎం పదవికోసం పీవీ నరసింహారావుతో పోటీ పడ్డాడు. సీఎం పదవి దక్కనందుకు గవర్నర్గా నియమిస్తామని నాటి ప్రధాని ఇందిరాగాంధీ పిలిచి చెపితే, సున్నితంగా తిరస్కరించాడు. కాసు బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రిత్వ ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా ఉంటూ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ పక్షపాతిగా ఉద్యమ ఉధృతి కోసం రాజీనామా చేశాడు. 1969 మార్చి 27న తన రాజీనామాను ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డికి అందజేసిండు. దాన్ని ఆమోదిస్తున్నట్లు సీఎం ప్రకటించిండు. ఈ రాజీనామా ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఒక చారిత్రక మలుపు తిప్పిందని చెప్పవచ్చు. 1972లో భువనగిరి నుండి విజయం కైవసం

చేసుకున్నాడు. 1973 లో పాములపర్తి వేంకట నరసింహారావు తదనంతరం ముఖ్యమంత్రి అయ్యే అవకాశం గడప తొక్కిన , ఇందిరా గాంధీ ఒప్పుకున్నా,

నాటి హోం మంత్రి ఉమా శంకర్ దీక్షిత్ పట్టు వల్ల వెంగళరా వు కు ముఖ్య మంత్రి అయ్యే ఛాన్స్ దొరికింది. 1958లో హుస్సేన్ సాగర్ తీరాన భూమి కొనుక్కుని జలదృశ్యం నిర్మించు కోగా, 2002 లో చంద్రబాబు ప్రభుత్వం దాన్ని నేలమట్టం చేయించగా , కోర్టు కెళ్ళి తనకు అనుకూల తీర్పు పొందాడు. చివరకు 97వ సంవత్సరంలో 2012 సెప్టెంబర్ 21న మరణించగా , జలదృశ్యం లోనే అంత్య క్రియలు జరిగాయి. 1952లో ముల్కీ ఉద్యమంతో తెలంగాణ కోసం పోరాటం ప్రారంభించి, ప్రత్యేక రాష్ట్రం కోసం తొలి రాజీనామా చేసి, 97 ఏళ్ల పండు ముదుసలి వయసులో, ఎముకలు కొరికిన చలిని లెక్క చేయక ఢిల్లీలో దీక్ష చేసి, గాంధీ మార్గంలో శాంతియుత పోరాటాన్ని ఎంచుకుని, బాపూజీ గా పిలువబడే కొండా లక్ష్మణ్, తన ఆస్తులను , జీవితాన్ని ధారబోసి, కొండంత గొప్ప వ్యక్తిత్వం, నిబద్ధత కలిగిన రాజకీయ ఆదర్శ నేతగా గుర్తింపు నొందాడు. 2000లో మలి దశ ఉద్యమం ప్రారంభించిన కేసీఆర్ను ప్రోత్సహించడమే కాదు సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న తన నివాస బంగ్లా జలదృశ్యంను టీఆర్ఎస్ ప్రధాన కార్యాలయానికి ఇచ్చారు. ఇక్కడే తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. నాటి నుంచి అశోక్ నగర్లోని అద్దె ఇంటిలోనే కొండా లక్ష్మణ్ బాపూజీ నివసించాడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చివరి శ్వాస ఉన్నంత వరకు చిత్తశుద్ధితో కృషి చేసి, మూడు తరాల వారధి ఉన్న తెలంగాణ రాష్ట్ర అలు పెరుగని, అవిశ్రాంత పోరాట యోధుడు బాపూజీ తెలంగాణ ప్రజానీకానికి ప్రాతఃస్మరణీయుడు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 26:(నేటినిజం ప్రతినిధి): వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూము మధు ఆధ్వర్యములో ఘనంగా నిర్వహించారు వీరనారి చాకలి ఐలమ్మ 131వ, జయంతి సందర్భంగా ఆమె చేసిన తెలంగాణ పోరాట స్పూర్తిని కొనియాడుతు వేములవాడ లో చెక్కపల్లి బస్టాండ్ చౌరస్తాలో ఆమె విగ్రహానికి తూము మధు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమములో కాన్సిలర్ తోట రాజు, కాంగ్రెస్ జిల్లా నాయకులు అరుణ్ తేజ చారి, కార్యవర్గ సభ్యులు, చాకలి ఐలమ్మ సంగం రాష్ట్ర నాయకులు మైలారం రాము, పట్టణ ఉపాధ్యక్షులు గుమ్మడి రాజేశం గౌడ్, ప్రధాన కార్యదర్శి సిర్రం ప్రసాద్ యాదవ్ తథదితరులు పాల్గొన్నారు.

# 28న కరీంనగర్లో 'శాతవాహన గ్రామీణ సంత' వాల్ పోస్టర్ ఆవిష్కరణ..

పోస్టర్ ను ఆవిష్కరించిన మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్...



కరీంనగర్, సెప్టెంబర్ 26: (నేటినిజం ప్రతినిధి) గుడ్ ఈవెనింగ్వర్యావరణ పరిరక్షణ, వ్యాధుల నివారణ, ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా ఈనెల 28న కరీంనగర్లో గ్రామ భారతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న "శాతవాహన గ్రామీణ సంత" వాల్ పోస్టర్ను శనివారం రోజున మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆవిష్కరించారు.

విష రహిత ఆహార ఉత్పత్తిదారులు, చేతివృత్తుల వారు , వినియోగదారులకు పరస్పర తోడ్పాటును అందించే ఏకైక లక్ష్యంతో ఈ సంతను నిర్వహిస్తున్నట్టు గ్రామ భారతి బాధ్యులు తెలిపారు

.సెప్టెంబర్ 28 సోమవారం ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 7:00 గంటల వరకు కరీంనగర్ కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రెవెన్యూ గార్డెన్లో ఈ సంత జరుగుతుందని తెలిపారు. మొత్తం 60 స్టాల్స్తో, అంచనాగా 1200 మంది వినియోగదారుల భాగస్వామ్యంతో ఈ సంత జరగనుందన్నారు.

ఈ కార్యక్రమంలో డి.ఇ. వెంకటేశ్వర్లు, ఎ.ఇ. సతీష్తో పాటు శాతవాహన గ్రామీణ సంత రాష్ట్ర, జిల్లా కార్యకర్తలు జిన్నా సత్యనారాయణ రెడ్డి, రఘురాం రెడ్డి, నాల్యా మడుగుల శంకరయ్య, గాలిపెల్లి నాగేశ్వరరావు, కూర్మాచలం మునీందర్, గొల్లే తిరుపతి, క్యాన మధు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాల పనులు సమన్వయంతో పూర్తి చేయాలి

## -పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



కరీంనగర్, సెప్టెంబంర్ 26: గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను సంబంధిత శాఖల అధికారులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అదనపు కలెక్టర్ బి శ్రీరాములుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్ల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, ఓదెల మల్లికార్జున స్వామి దేవాలయ అభివృద్ధి పనులు, భూసేకరణ, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, పార్కింగ్, తదితర అంశాలపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గోదావరి పుష్కరాల కోసం ప్రధానంగా రోడ్ల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, దేవాదాయ ఆలయాల అభివృద్ధి పనులతో పాటు భక్తులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పుష్కరాల కోసం ఆర్అండ్బీ శాఖ ఆధ్వర్యంలో రోడ్ల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని పనులను సూచించారు. మంథని ఆలయాల సమూహ అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని గౌతమేశ్వర, సురబాండేశ్వర, ఓంకారేశ్వర, త్రిబంధేశ్వర, మహాలక్ష్మి అభివృద్ధి పనులు కాలంలో పూర్తి చేయాలని తెలిపారు. ఓదెల మల్లికార్జున స్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులు కోసం ప్రభుత్వం 10 కోట్లు మంజూరు చేసిందని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాల తొలగింపు వంటి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తలనీలాలు సమర్పించే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అన్నదాన మండపాల ఏర్పాట్లను కూడా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్ల అభివృద్ధి, ఆలయాల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం తదితర పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఘాట్ల నిర్మాణానికి అవసరమైన భూమిని వెంటనే సంబంధిత శాఖలకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మంథనిలో ఘాట్ల నిర్మాణానికి అవసరమైన భూమి ఇప్పటికే ఎంజాయ్మెంట్ సర్వే పూర్తయినందున స్థానిక రైతులతో చర్చించి భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఏదైనా సమస్య కారణంగా పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో మంథని ఆర్డిఓ సురేష్ మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఇరిగేషన్ అధికారులు, ఎండోమెంట్ అధికారులు, హెచ్ సెక్షన్ పర్యవేక్షకులు శ్రీపాద ఈశ్వర్ , ఆర్ అండ్ బి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఎన్హెచ్ఆర్సీ సెప్టెంబర్-2026 ఆన్లైన్ ఇంటర్న్షిప్ కార్యక్రమం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26భారత జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్హెచ్ఆర్సీ) నిర్వహించిన రెండు వారాల ఆన్లైన్ స్వల్పకాలిక ఇంటర్న్షిప్ కార్యక్రమం (ఓఎస్టీఐ) విజయవంతంగా ముగిసింది. 95 మంది విశ్వవిద్యాలయ స్థాయి విద్యార్థులు ఈ ఇంటర్న్షిప్ పూర్తి చేసుకున్నారు. ఈ ఇంటర్న్షిప్ ఈ నెల 14న ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వచ్చిన 1008 మంది దరఖాస్తుదారులను పరిశీలించి ఈ ఇంటర్న్లను ఎంపిక చేశారు.

ముగింపు సమావేశానికి ఎన్హెచ్ఆర్సీ సభ్యులు, జస్టిస్ బిద్యుత్ రంజన్ సారంగి అధ్యక్షత వహించారు. ఇంటర్న్షిప్ విజయవంతంగా పూర్తి చేసిన ఇంటర్న్లను ఆయన అభినందించారు. ఈ రెండు వారాల శిక్షణా కార్యక్రమం కేవలం ఒక ప్రయాణం మాత్రమే కాదనీ, ఇది ఒక విలువైన అభ్యసన అనుభవమని ఆయన స్పష్టం చేశారు. ఇంటర్న్లు తమ ప్రయత్నాలు వృధా కాకుండా చూసుకోవాలని కోరుతూ... "బోధించండి, ఆచరించండి, ప్రదర్శించండి" అనే సూత్రాన్ని అనుసరించాల్సిన ప్రాముఖ్య తను ప్రముఖంగా ప్రస్తావించారు. మానవ హక్కుల గురించి నేర్చుకోవడం జీవితాంతం కొనసాగాలని, పొందిన జ్ఞానాన్ని ఆచరిస్తూ ఇతరులతోనూ పంచుకోవాలని జస్టిస్ సారంగి ఉద్ఘాటించారు.

ఇంటర్న్లు తమ దైనందిన ప్రవర్తనలో మానవ హక్కుల విలువలను ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. వృద్ధులు, వికలాంగులు సహా ఇతరుల పట్ల కరుణతో ఉండాలని, వారి అవసరాలను తగిన విధంగా పరిగణించాలని జస్టిస్ సారంగి కోరారు. యువకులుగా దేశ, సమాజ అభివృద్ధిపై ఇంటర్న్లు గొప్ప ఆశలను కలిగి ఉన్నారని ఆయన అన్నారు.

ఎన్హెచ్ఆర్సీ సభ్యురాలు శ్రీమతి విజయ భారతి సయాని ఇంటర్న్లను ఉద్దేశించి ప్రసంగిస్తూ... ఇంటర్న్షిప్ ముగింపు అంతం కాదనీ, ఒక కొత్త బాధ్యతకు ఆరంభమని అన్నారు. మానవ హక్కులు అంటే పరస్పర గౌరవం, న్యాయం, కరుణ, బాధ్యత అని పేర్కొన్నారు. వాటిని మన జీవన విధానంగా మార్చుకోవాలని సూచించారు. మానవ హక్కులు, రాజ్యాంగం, దేశం పట్ల నిబద్ధతను ముందుకు తీసుకువెళ్లాలని శ్రీమతి విజయ భారతి కోరారు.

మానవ హక్కులు, దేశభక్తి పరస్పర పూరకాలని వ్యాఖ్యానిస్తూ... రాజ్యాంగాన్ని గౌరవించాలని, మానవ గౌరవాన్ని కాపాడాలని, బలహీనులకు సేవ చేయాలని, న్యాయం కోసం నిలబడాలని శ్రీమతి సయాని ఇంటర్న్లకు సూచించారు. 'వసుధైవ కుటుంబం', 'సర్వే భవంతు సుఖినః' సూక్తులను ఉటంకిస్తూ... తమ తమ సమాజాల్లో మానవ హక్కుల రాయబారులుగా మారాలని ఆమె వారికి పిలుపునిచ్చారు. మరింత బలమైన, న్యాయమైన, మానవతాయుతమైన భారత్ కోసం తోడ్పాటునందించడంలో "జ్ఞానం, కరుణ, సేవ" మార్గదర్శక సూత్రాలుగా పనిచేస్తాయని శ్రీమతి సయాని ప్రముఖంగా ప్రస్తావించారు.

ఎన్హెచ్ఆర్సీ సెక్రటరీ జనరల్ శ్రీ పీయూష్ గోయల్ మాట్లాడుతూ ఇంటర్న్లను ప్రత్యేకంగా అభినందించారు. దైనందిన జీవితంలో మానవ గౌరవం పట్ల సున్నితత్వాన్ని పెంపొందించుకోవాల్సిన ప్రాముఖ్యతను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. విద్యాపరమైన జ్ఞానాన్ని ఆచరణలో పెట్టినప్పుడే అది అర్థవంతంగా ఉంటుందని ఆయన అన్నారు. జట్టుగా కృషి చేయడం, సంభాషణ నైపుణ్యాల విలువను ప్రస్తావిస్తూ... బృంద కార్యకలాపాలు జట్టు స్ఫూర్తిని, సహకార నైపుణ్యాలను పెంపొందించడంలో సహాయపడతాయని పేర్కొన్నారు. సమాజంలో మానవ హక్కుల ఆచరణ గురించి మరింత అవగాహన కల్పించడం ద్వారా మానవ హక్కులకు మార్గదర్శకులుగా మారాలని ఆయన ఇంటర్న్లను కోరారు.

# వరి విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన..

నల్గొండ, సెప్టెంబర్ 26: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వరి విత్తనోత్పత్తిపై ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) సభ్యులు, రైతులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, జయశంకర్ భూపాలపల్లి కోఆర్డినేటర్ డాక్టర్ కె. మదన్మోహన్రెడ్డి కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు.

తెలంగాణలో సుస్థిర వ్యవసాయ, ఆహార వ్యవస్థల కోసం పీఏసీఎస్ల ద్వారా విత్తనోత్పత్తి, విత్తన సరఫరా అంశంపై నాబార్డు ఆర్థిక సహకారంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం చేపట్టిన ప్రాజెక్టులో భాగంగా పీఏసీఎస్లను వరి (కేఎన్ఎం-1638) విత్తనోత్పత్తికి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విత్తనోత్పత్తి చేపట్టే రైతులు నాణ్యమైన విత్తనాన్ని ఉత్పత్తి చేయడంతో పాటు విత్తన నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్ వృక్ష ప్రజనన శాస్త్రవేత్త డాక్టర్ పి. గౌన్య నాయక్ మాట్లాడుతూ.. విత్తనోత్పత్తికి ముందుగా నాణ్యమైన, ధ్రువీకరించబడిన మూల విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. విత్తనోత్పత్తికి అనుకూలమైన భూమిని ఎంచుకుని, గత పంట అవశేషాలు, కలుపు మొక్కలు లేకుండా పొలాన్ని సిద్ధం చేయాలన్నారు.

విత్తనోత్పత్తి పొలంలో ఇతర వరి రకాలతో కల్తీ జరగకుండా తగిన దూరం పాటించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. పంట పెరుగుదల సమయంలో పొలాన్ని తరచూ పరిశీలిస్తూ ఇతర రకాల మొక్కలు, భిన్న లక్షణాలు కలిగిన మొక్కలు, కలుపు మొక్కలను గుర్తించి తొలగించాలని సూచించారు.

పంటలో పురుగులు, తెగుళ్లను సమగ్రంగా యాజమాన్యం చేయాలని డాక్టర్ గౌన్య నాయక్ సూచించారు. ముఖ్యంగా కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగు తదితర సమస్యలను ఎప్పటికప్పుడు గమనించాలని తెలిపారు. పుష్పించే దశలో, కోతకు ముందు పొల పరిశీలన (రోగింగ్) నిర్వహించడం ద్వారా ఇతర రకాల మొక్కలను తొలగించి జన్యు స్వచ్ఛతను కాపాడుకోవచ్చన్నారు.

కోత సమయంలో ఇతర రకాల విత్తనాలు కలవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కోత అనంతరం విత్తనాన్ని సరిగ్గా శుభ్రపరిచి, తేమను తగ్గించి శాస్త్రీయ పద్ధతిలో నిల్వ చేయడం ద్వారా నాణ్యతను కాపాడుకోవచ్చన్నారు. విత్తనాన్ని తగిన తేమ స్థాయికి ఆరబెట్టి, పురుగులు, ఎలుకల బారిన పడకుండా సురక్షిత ప్రదేశంలో నిల్వ చేయాలని సూచించారు.

జిల్లా కోఆపరేటివ్ అధికారి వల్యా నాయక్ మాట్లాడుతూ.. వ్యవసాయ విశ్వవిద్యాలయం, నాబార్డు సహకారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను విత్తనోత్పత్తికి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.

# గ్రామస్థుల్లో భయాందోళన..!

ఆదిలాబాద్, సెప్టెంబర్ 26: అక్కన్నపేట మండలం చౌటపల్లి శివారులో గుర్తు తెలియని వ్యక్తులు పూజలు చేసిన ఆనవాళ్లు కలకలం రేపాయి. చెరువు కట్ట సమీపంలోని రహదారిపై చీరలు, నిమ్మకాయలు, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమతో ఓ బొమ్మను ఏర్పాటు చేసి పూజలు చేసినట్లు గ్రామస్థులు గుర్తించారు.

రహదారిపై ఈ విధంగా పూజా సామగ్రి కనిపించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. పూజలు ఎవరు చేశారు? ఎందుకు చేశారు అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# చెత్త ఏరుకునే వృత్తి నుంచి మెరుగైన ఆర్థిక భద్రత వరకు కుమారగిరి అంకమ్మ ప్రయాణం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26:గుంటూరులో గత 25 ఏళ్లుగా చెత్త ఏరుకునే పనిచేస్తూ తక్కువ ఆదాయంతోనే కుమారగిరి అంకమ్మ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

'స్వచ్ఛతా ఉద్యమి యోజన' (ఎస్యూవీ) కింద అందిన ఆర్థిక సహాయం ఆమె జీవనోపాధిని మెరుగుపరుచుకోవడానికి, మెరుగైన ఆర్థిక భద్రతను సాధించడానికి ఎంతగానో తోడ్పడింది.

45 ఏళ్ల అంకమ్మ ఎస్టీ (షెడ్యూల్డ్ తెగ) వర్గానికి చెందినవారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువుకునే అవకాశం లేకపోవడంతో ఆమె చిన్నతనంలో తన తల్లిదండ్రులతో కలిసి చెత్త ఏరుకునే పనికి వెళ్లేవారు. తక్కువ ఆదాయం, కష్టతరమైన జీవన పరిస్థితులు, సామాజిక బహిష్కరణ కారణంగా ఆమె కుటుంబం ఇంటి అవసరాలను తీర్చుకోవడం లేదా అత్యవసర పరిస్థితుల కోసం కొంత మొత్తాన్ని పొదుపు చేయడం చాలా కష్టమైంది.

అంకమ్మ వారంలో ఆరు రోజులు పని చేస్తూ చెత్త ఏరుకోవడం ద్వారా రోజుకు సుమారు రూ. 150?200 సంపాదించేవారు. తన కుటుంబ జీవన పరిస్థితులను మెరుగుపరుచుకోవాలని, మరింత నమ్మకమైన ఆదాయ వనరును ఏర్పాటు చేసుకోవాలని ఆమె ఎంతో అనుకునేవారు.

2023 జూన్ 19న 'స్వచ్ఛతా ఉద్యమి యోజన' (ఎస్యూవీ) కింద ఐదుగురు సభ్యుల గ్రూప్ ప్రాజెక్ట్లో భాగంగా నవజీవన్ ఆర్గనైజేషన్ ద్వారా అంకమ్మకు సహాయం లభించింది. ఈ ప్రాజెక్ట్ మొత్తం వ్యయం రూ. 49,96,925 కాగా ఇందులో రూ. 31,22,695 రుణం, రూ. 18,74,230 ముందస్తు మూలధన రాయితీగా ఉన్నాయి. ఈ సహాయం ఆమె మెరుగైన జీవనోపాధి అవకాశాలను పొందడానికి తోడ్పడింది.

ఈ పథకం ద్వారా తనకు లభించిన సహాయం పట్ల సంతోషం వ్యక్తం చేసిన అంకమ్మ.. "నెలకు అదనంగా సుమారు రూ. 10,000 ఆదాయం వస్తుండటంతో నా కుటుంబ ఆర్థిక భద్రత మరింత బలపడింది" అని అన్నారు.

ఈ ఆర్థిక సహాయం తర్వాత ఆమెకు నెలకు అదనంగా సుమారు రూ. 10,000 ఆదాయం సమకూరుతున్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.